

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 06-04-2025 | సంపుటి - 22 | సంచిక - 342 | రూ : 4 | పేజీలు: 8




## రాజధానికి
# అభివృద్ధి హారమే

- రూ.30 వేల కోట్లతో హైదరాబాద్ ప్రగతికి ప్రణాళిక
- రూ.7,032 కోట్లతో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్ల విస్తరణ...
- కొనసాగుతున్న టెండరు ప్రక్రియ
- మే నెలలో పెద్ద ఎత్తున పనులు

### ప్రారంభించేందుకు సన్నాహాలు

హైదరాబాద్: హైదరాబాద్ మహా నగరపాలక సంస్థ(జీహెచ్ఎంసీ), హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథార్టీ (హెచ్ఎండీఏ) పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీటి సరఫరా తదితర పనులు త్వరలోనే పెద్ద ఎత్తున ప్రారంభం కానున్నాయి. రూ.30 వేల కోట్లకు పైగా విలువ చేసే పనులు టెండరు ఆమోదం, టెండరు ప్రక్రియ చేపట్టే దశలలో తరువాయి 2లో






## శ్రీరామనవమి వేళ.. నేడు అయోధ్యలో ప్రత్యేక ఏర్పాట్లు

2లో





## భద్రాద్రిలో నేడు
# సీతారామ కల్యాణం

- ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్న సీఎం రేవంత్
- భద్రాచలం-న్యూస్‌టుడే,ఈనాడు-హైదరాబాద్

భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి 7 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామితో పాటు పలువురు దాతలు, భక్తులు సీతారాములవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. దేవాదా యశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, ఈఓ రమాదేవి పాల్గొన్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం కల్యాణ మహోత్సవం ఉంటుంది. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ధ్రువమూర్తుల కల్యాణం జరపనున్నారు. అనంతరం తరువాయి 2లో

## రక్షణ సహకారానికి 'సప్తపది

- ఏడు ఒప్పందాలపై భారత్-శ్రీలంక సంతకాలు
- మోదీకి అత్యున్నత 'మిత్ర విభూషణ' పురస్కారం



కొలంబో: రక్షణ రంగంలో బంధా లను బలోపేతం చేసుకునే వ్యవస్థను రూపొం దించడానికి తొలిసారిగా భారత్‌శ్రీలంక ఏడు ఒప్పందాలపై సంతకాలు చేశాయి. రెండు దేశాల భద్రత పరస్పర ఆధారితమని భారత ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు.

తరువాయి 2లో

## ఏఐ ఫేక్ కంటెంట్‌తో...
# పెనుముప్పు

- దానిపై విచారణ కోసం కోర్టుకు విజ్ఞప్తి చేయాలి
- సైబర్ క్రైం విభాగాన్ని బలోపేతం చేయాలి
- కంచ గచ్చిబౌలి భూములపై సమీక్ష సందర్భంగా
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో వ్యాప్తి చేసే ఫేక్ కంటెంట్ (తప్పుడు సమాచారం) కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోలీసు అధికారుల్ని ఆదేశించారు. సమాజాన్ని తప్పుదోవ పట్టించే ఏఐ ఫేక్ కంటెంట్ తరువాయి 2లో



## భద్రాచలంలో వైభవంగా
# ధ్వజారోహణం

2లో





## చరిత్రను మార్చబోతున్న పీ4

- ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి పథకం లేదు
- మార్గదర్శుల భరోసాతో నమ్మకం పెరిగింది
- బలమైన ఆర్థిక వ్యవస్థగా ఏపీని తీర్చిదిద్దుతాం
- బాబూజగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో బడుగుల అభ్యున్నతి
- ముప్పాళ్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటన

తరువాయి 2లో

## హెచ్‌సీయూ వ్యవహారంలో
# ప్రభుత్వ వైఖరి సరికాదు

- రాష్ట్ర పరువు, ప్రతిష్ఠలను దిగజార్చింది
- భారాస అధినేత కేసీఆర్

హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) విద్యార్థుల పోరాటాన్ని భారాస అధినేత కేసీఆర్ అభినందించారు. రాష్ట్రంతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల విద్యార్థులు ఈ వర్సిటీలో చదువుకునేందుకు వస్తుంటారని.. అంతటి ఖ్యాతి ఉన్న విశ్వవిద్యాలయం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి సరికాదని తప్పుపట్టారు. అధికారం చేతిలో ఉంది తరువాయి 2లో



# రాజధానికి అభివృద్ధి హారమే

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయి. ఒప్పందాలు పూర్తి చేసుకొని మే నెలలో ఈ పనులన్నీ ప్రారంభించడానికి పురపాలక శాఖ సన్నాహాలు చేస్తోంది. గోదావరి నుంచి 20 టీఎంసీల నీటి మళ్లింపు సహా ఎలివేటెడ్ కారిడార్లు, రేడియల్ రోడ్లు, ఫ్లైఓవర్లు ఇలా అనేక పనులను చేపట్టాలని నిర్ణయించిన ప్రభుత్వం గత ఏడాది, ఈ ఏడాది ప్రారంభంలో పరిపాలనా అనుమతులు ఇచ్చింది. పనులను ప్యాకేజీల వారీగా విభజించింది. అంచనాల తయారీ, టెండర్లు పిలవడం ప్రారంభమైంది. కొన్ని టెండరు దశ దాటి ఆమోదం కోసం ఎదురు చూస్తున్నాయి. మరికొన్ని టెండరు ప్రక్రియ దశలో ఉన్నాయి.

### * గోదావరి నీటిని మళ్లించేలా

రాజధానిలో అవుటర్ రింగ్ రోడ్ వరకు తాగునీటిని సరఫరా చేయాల్సిన హైదరాబాద్ మెట్రోవాటర్ వర్క్స్... రానున్న సంవత్సరాల్లో ఇబ్బంది లేకుండా ఉండేందుకు మల్లన్నసాగర్ నుంచి గోదావరి నీటిని మళ్లించాలని నిర్ణయించి రూ.7,360 కోట్లతో పరిపాలనా అనుమతి ఇచ్చింది. ఈ పనులను రెండు ప్యాకేజీలుగా విభజించి రూ.5,400 కోట్లతో టెండర్లు పిలిచింది. ప్రస్తుతం పరిశీలన జరుగుతోంది. పది రోజుల్లో సీవోటీకి వెళ్తాయి. మే మొదటి వారం నుంచి పనులు ప్రారంభించాలన్నది లక్ష్యం. యాన్యుటీ మోడల్‌లో ఈ పనులను చేపడతారు. 40 శాతం మెట్రోవాటర్ బోర్డు భరిస్తే, మిగిలిన 60 శాతం గుత్తేదారులు రుణాల ద్వారా తీసుకొంటారు. 10.3 శాతం వడ్డీ. గతంలో కంటే 2.2 శాతం వడ్డీని తగ్గించినట్లు, నేషనల్ హైవే వారు చెల్లించే ఫార్ములానే ఇక్కడ వినియోగించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. పది సంవత్సరాల నిర్వహణ బాధ్యత కూడా నిర్మాణ సంస్థలదే.

### * అమృత్ పథకం కింద 39 ఎస్‌టీపీలు

అమృత్ పథకం కింద 39 ఎస్‌టీపీల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ చేపట్టారు. వీటి విలువ రూ.3,800 కోట్లు. ఇందులో కొన్నింటికి టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది.

### * ఎలివేటెడ్ కారిడార్లకు రూ.5,106 కోట్లు

హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో రూ.5,106 కోట్లతో రెండు ఎలివేటెడ్ కారిడార్ల పనులకు గత ఏడాది నవంబరులో పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫాం రోడ్డు వరకు (జాతీయ రహదారి 44తో) రూ.1,487 కోట్లతో చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పని ప్రస్తుతం టెండర్ దశలో ఉంది. ఈ పనిని ఈపీసీ పద్ధతిలో చేపట్టనున్నారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఓ.ఆర్.ఆర్ వరకు (రాష్ట్ర రహదారి 01తో) రూ.3,619 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనికి టెండర్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ పనిని కూడా ఈపీసీ పద్ధతిలో చేపట్టనున్నారు.

### * ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్ల విస్తరణ...

జీహెచ్ఎంసీ పరిధిలో రూ.7,032 కోట్లతో వివిధ పనులు చేపట్టారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్కు ముగ్గ జంక్షన్, ఫిల్మ్‌నగర్ జంక్షన్, మహారాజ అగ్రసేన్ జంక్షన్, క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ వద్ద స్టీల్ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, కాజాగూడ జంక్షన్, ఐఐటి జంక్షన్ వద్ద మల్టీలెవల్ ఫ్లైఓవర్లు, అంజయ్యనగర్ నుంచి రాంకీ టవర్ వరకు రోడ్ల విస్తరణ, ఇంకా పలు ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ పనులు, ఫ్లైఓవర్లు, ఆర్వోబీలు ఉన్నాయి. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు కూడా పలు పనులు చేపట్టనున్నారు.

### * రావిర్యాల నుంచి ఆమనగల్లు వరకు..

రావిర్యాల నుంచి ఆమనగల్లు వరకు రేడియల్ రోడ్ల నిర్మాణాన్ని రూ.4,500 కోట్లతో చేపట్టనున్నారు. గతంలో చేయని లింకు రోడ్లకు (మిస్సింగ్ లింక్ రోడ్లకు) మరో రూ.1,500 కోట్లు ఖర్చు చేయనున్నట్లు పురపాలక శాఖ వర్గాలు తెలిపాయి. మూసీ పునరుజ్జీవ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. డీపీఆర్ తయారీ జరుగుతోంది. మరో రెండుమూడు నెలల్లో కన్సల్టెన్సీ సంస్థ డీపీఆర్ అందజేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సంబంధిత అధికారులతో, కన్సల్టెన్సీ సంస్థతో తరచూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశమై సమీక్షిస్తున్నారు. బడ్జెట్‌లో కూడా రూ.1,500 కోట్లు కేటాయించారు. మొత్తమ్మీద పురపాలక శాఖ ఆధ్వర్యంలో మే నెల నుంచి రూ.30వేల కోట్లకు పైగా పనులు ప్రారంభమవుతాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# హెచ్‌సీయూ వ్యవహారంలో ప్రభుత్వ వైఖరి సరికాదు

(మొదటిపేజీ తరువాయి)

కదాని నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఖరిని న్యాయస్థానాలు, సమాజం తిప్పికొడుతున్నాయన్నారు. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం గుణపాఠంగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు మద్దతుగా నిలిచిన భారాస శ్రేణులను కేసీఆర్ అభినందించారు. పార్టీ రజతోత్సవ మహాసభ సన్నాహక సమావేశాల్లో భాగంగా శనివారం ఎర్రవల్లిలోని తన నివాసంలో ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల ముఖ్య నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

''భారాస పాలనలో తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలిపాం. దీన్ని నిలుపుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదు. ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజార్చింది. హెచ్‌సీయూ భూముల విషయంలో దుందుడుకు చర్యలతో దేశవ్యాప్తంగా రాష్ట్ర పరువు, ప్రతిష్ఠలను దిగజార్చేలా వ్యవహరిస్తున్నారు. ప్రజల ఆకాంక్షలను ఉద్యమ స్ఫూర్తి ఉన్న భారాస మాత్రమే అర్థం చేసుకోగలదు. కాంగ్రెస్ పాలన తీరుతో భారాస చిత్తశుద్ధి ఏంటో ప్రజలకు అర్థమైంది. సాగు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది.

### * వ్యతిరేక శక్తుల మోసపూరిత వాగ్దానాలతో..

భారాస ప్రభుత్వ హయాంలో కుల వృత్తులకు స్వర్ణయుగంగా ఉండేది. రైతులకు పెట్టుబడి అందించిన మొట్ట మొదటి సర్కారు భారాస ప్రభుత్వమే. రైతు వేలిముద్ర పెడితే తప్ప భూమి మరొకరికి బదిలీ కాకుండా ధరణి ద్వారా రక్షణ కల్పించాం. 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందుబాటులోకి తెచ్చుకున్నాం. రాష్ట్రం ఏర్పడినప్పుడు 7 వేల మెగావాట్లుగా ఉన్న స్థాపిత విద్యుత్ సామర్థ్యాన్ని 20 వేల మెగావాట్లకు పెంచాం. తెలంగాణ వ్యతిరేక శక్తులు మోసపూరిత వాగ్దానాలతో ఆశలు రేకెత్తించి అధికారం చేజిక్కించుకున్నాయి. పాలించడం చేతకాక భారాస పాలనను తప్పుపడుతున్నారు'' అని కేసీఆర్ పేర్కొన్నారు. వరంగల్ రజతోత్సవ సభ అనంతరం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు సూచించారు. సమావేశంలో మాజీ మంత్రులు డా.లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నిరంజన్‌రెడ్డి, పువ్వాడ అజయ్, జగదీశ్‌రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్, కోటిరెడ్డి, నేతలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, జోగినిపల్లి సంతోష్, గ్యాదరి బాలమల్లు తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రను మార్చబోతున్న పీ4

అమరావతి: సమాజంలో ఆర్థికంగా ఎదిగినవాళ్లు.. పేదలను తమ కుటుంబసభ్యుల్లా భావించి పైకి తీసుకొస్తామని భరోసా ఇవ్వడం చూస్తుంటే పీ4 కార్యక్రమం కచ్చితంగా విజయవంతం అవుతుందనే నమ్మకం కలిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. పేదరిక నిర్మూలనకు ప్రపంచంలోనే ఎక్కడా ఇలాంటి ప్రయోగం జరగలేదన్నారు. ఇది చరిత్రను తిరగరాసే కార్యక్రమం అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం ముప్పాళ్లలో నిర్వహించిన బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం పాల్గొన్నారు. పీ4 అమలులో భాగంగా ప్రజావేదికపై గ్రామంలోని 41 బంగారు కుటుంబాలు, వారిని ఆదుకునేందుకు వచ్చిన మార్గదర్శులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సమాజంలో అసమానతలపై బాబూ జగ్జీవన్‌రామ్ చిన్నతనం నుంచే పోరాడారన్నారు. జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్, పులె.. వంటి మహనీయుల స్ఫూర్తితో ముందుకెళుతున్నామని చెప్పారు. దేశంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థగా ఏపీని ఆవిష్కరించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. వైకాపా పాలకుల దెబ్బకు సర్వనాశనమైన రాష్ట్ర పరిస్థితిని.. ఎన్డీయే ప్రభుత్వం కొలువుదీరిన తొమ్మిది నెలల్లోనే గాడిన పెట్టగలిగామని చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన ప్రసంగంలో ముఖ్యాంశాలివీ..

### * 20 లక్షల బంగారు కుటుంబాల ఎంపిక

'రాష్ట్రంలో 20 లక్షల బంగారు కుటుంబాలను ఎంపిక చేశాం. పేదరికంలో ఉన్న వీరందరినీ ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మార్గదర్శులకే అప్పగిస్తూ పీ4ను రూపొందించాం. రాష్ట్రంలోని ఏ వ్యక్తీ పేదరికంతో ఉండకూడదు. ఒకవైపు ప్రభుత్వం తరఫున సంక్షేమ పథకాలను దేశంలోనే మరే రాష్ట్రంలో లేని విధంగా అమలు చేస్తూనే.. అభివృద్ధికి బాటలు వేస్తున్నాం. వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, తీవ్ర అనారోగ్య సమస్యలతో మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేల సామాజిక భద్రతా పింఛను ఏ రాష్ట్రంలోనూ లేదు.

### * 20-30 ఏళ్ల దూరదృష్టితో ఆలోచిస్తా

నేను సమాజాన్ని ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ 2030 ఏళ్ల దూరదృష్టితో ప్రణాళికలు రూపొందిస్తూ.. కొత్త ఆలోచనలను అమలు చేస్తుంటాను. పీ4 కార్యక్రమం కూడా ఇలాంటిదే. నా ఆలోచనలు అర్థం చేసుకున్నవాళ్లు వాటిని అందిపుచ్చుకుని బాగుపడుతుంటారు. అర్థంకాని వారు అవకాశాలను కోల్పోతుంటారు. 2047 నాటికి ఏపీని స్వర్ణాంధ్రగా అభివృద్ధి చేయడంతోపాటు.. ప్రజల ఆదాయ వనరులు రెట్టింపు చేయడమే నా లక్ష్యం. ముప్పాళ్లలో అభివృద్ధి పథకాల శిలాఫలకాలను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు. చిత్రంలో సత్యకుమార్, కేశినేని శివనాథ్, తంగిరాల సౌమ్య, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఉండవల్లి శ్రీదేవి తదితరులు

### * పిల్లలు లేకుంటే ఊళ్లే ఉండవు

జనాభాను పెంచండి. ప్రస్తుతం జనాభా తగ్గే పరిస్థితి వస్తుంది. దీని వల్ల రాష్ట్రం నష్టపోతుంది. దంపతులు ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలకు జన్మనివ్వాలి. ప్రస్తుత అంచనాల ప్రకారం మరికొన్ని దశాబ్దాలకు జనాభా తగ్గిపోతుంది. అప్పుడు ఊళ్లలో పిల్లలు ఉండరు. అంతా ముసలివాళ్లే ఉంటారు. ఆ తర్వాత ఊళ్లే ఉండవు. ఆ పరిస్థితి రాకూడదనే జనాభా పెంచాలని పదేపదే చెబుతున్నా.

### * బాబూ జగ్జీవన్‌రామ్ సోలార్ పథకం

బాబూ జగ్జీవన్‌రామ్ సౌరశక్తి పథకం కింద ఎస్సీలకు 2 కిలోవాట్ల సౌరవిద్యుత్తు ప్యానళ్లు ఇస్తాం. వచ్చే ఏడాది కాలంలో 20 లక్షల ఎస్సీ కుటుంబాలకు ఈ రూఫ్‌టాప్ సోలార్ కనెక్షన్లు పెట్టిస్తాం. ఎస్సీ వర్గీకరణకు 30 ఏళ్ల కిందటే మద్దతిచ్చా. మళ్లీ నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే వర్గీకరణ అమలు చేసే అవకాశం రావడం నా పూర్వజన్మ సుకృతం. ఎస్సీల సంక్షేమం కోసం 27 పథకాలను తెదేపా ప్రభుత్వంలో అమలు చేస్తే.. గత పాలకులు వాటన్నింటినీ రద్దు చేశారు. ప్రస్తుతం ఎన్టీఆర్ భరోసా కింద 11.38 లక్షల మంది ఎస్సీలకు పింఛన్లు అందిస్తున్నాం. వంద శాతం ఎస్సీ, బీసీల పిల్లలకు గురుకుల విద్యను అందిస్తాం.

### * నా రికార్డు అధిగమించడం కష్టం

నేను ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా, సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేశా. తెలుగు రాష్ట్రాల్లో ఈ రికార్డు అధిగమించడానికి చాలా సమయం పడుతుంది. ప్రస్తుతం మా ప్రభుత్వం ముందు అనేక సవాళ్లున్నాయి. వాటన్నింటినీ అధిగమిస్తూ వెళుతున్నాం. ఒకవైపు రూ.10 లక్షల కోట్ల అప్పులకు వడ్డీ కడుతూ.. మరోవైపు ఆదాయం పెంచుతూ.. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ.. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన పోలవరం, అమరావతి నిర్మాణం చేపట్టడం కొంచెం కష్టమే. అయినా ఇష్టంగా చేస్తున్నాం' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, వసంత కృష్ణప్రసాద్, శ్రీరాం తాతయ్య, కలెక్టర్ జి.లక్ష్మీశ పాల్గొన్నారు.

# రక్షణ సహకారానికి 'సప్తపది'

(మొదటిపేజీ తరువాయి)

బ్యాంకాక్‌లో బిమ్‌స్టెక్ సదస్సులో పాల్గొన్న ఆయన అక్కడి నుంచి శుక్రవారం రాత్రి నేరుగా శ్రీలంకకు చేరుకున్నారు. కొలంబోలోని చారిత్రక ఇండిపెండెన్స్ స్క్వేర్ వద్ద అధ్యక్షుడు కుమార దిసనాయకే శనివారం ఆయనకు స్వాగతం పలికారు. ఇక్కడ ఓ విదేశీ ప్రభుత్వాధినేతకు స్వాగతం లభించడం ఇదే ప్రథమం. దిసనాయకేతో చర్చల అనంతరం వారి సమక్షంలో ఒప్పందాలు కుదిరాయి. యూఏఈతో కలిసి ట్రింకోమలీని ఇంధన కేంద్రంగా అభివృద్ధి చేయడం, పవర్‌గ్రిడ్ ద్వారా అనుసంధానత వంటివి దీనిలో ఉన్నాయి. రుణాల పునర్వ్యవస్థీకరణకూ భారత్ ఆమోదం తెలిపింది.

### * మత్స్యకారుల్ని వదిలిపెట్టండి

రెండు దేశాల మధ్య మత్స్యకారుల వివాదాలకు మానవతా దృక్పథంతో పరిష్కారం చూపించాల్సిన అవసరం ఉందని మోదీ చెప్పారు. శ్రీలంక నిర్బంధంలో ఉన్న మత్స్యకారుల్ని, వారి పడవల్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. శ్రీలంకలోని తమిళ నేతల బృందంతోనూ మోదీ విడిగా భేటీ అయ్యారు. భారతదేశ భద్రత ప్రయోజనాలకు వ్యతిరేకంగా తమ భూభాగాన్ని ఏ రూపంలోనైనా వాడుకునేందుకు ఏ దేశాన్నీ అనుమతించేది లేదని దిసనాయకే స్పష్టంచేశారు. చర్చల అనంతరం ఇద్దరు నేతలు కలిసి సంపూర్ సౌర విద్యుత్కేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. శ్రీలంక అత్యున్నత పురస్కారమైన మిత్ర విభూషణ అవార్డును మోదీకి దిసనాయకే ప్రదానం చేశారు. ఇది 140 కోట్లమంది భారతీయులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు భారత ప్రధాని తెలిపారు. ద్వైపాక్షిక సంబంధాల్లో మోదీ కృషికి గుర్తింపుగా దీనిని అందజేశారు.

## భద్రాద్రిలో నేడు సీతారామ కల్యాణం

(మొదటిపేజీ తరువాయి)

కల్యాణమూర్తులను అలంకరించి ఊరేగింపుగా మిథిలా మండపానికి తీసుకెళ్తారు. అక్కడ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. భద్రాచలంలో ఆదివారం జరిగే కల్యాణ మహోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటారు. ఆయన ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. ఉదయం 8.45 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి భద్రాచలానికి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు. ఉదయం 10.40 గంటలకు ఆలయానికి చేరుకుని, భద్రాద్రి రామయ్యను దర్శించుకుంటారు. ఆ తర్వాత మిథిలా మండపంలో జరిగే కల్యాణ మహోత్సవంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.35 గంటలకు బూర్గంపాడు మండలం సారపాకలో ఓ సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి.. భోజనం చేస్తారు. మధ్యాహ్నం 2.15 గంటలకు హైదరాబాద్‌కు తిరుగుప్రయాణం అవుతారు.

## ఏఐ ఫేక్ కంటెంట్‌తో పెనుముప్పు

(మొదటిపేజీ తరువాయి)

తయారీపై విచారణకు ఆదేశించేలా రాష్ట్ర ప్రభుత్వం తరఫున కోర్టుకు విజ్ఞప్తి చేయాలని సూచించారు. కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి కోర్టులో ఉన్న కేసులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్, ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) భూములను లాక్కున్నట్లుగా సామాజిక మాధ్యమాల్లో కృత్రిమంగా వివాదం సృష్టించారంటూ సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. తదుపరి కార్యాచరణపై అధికారులకు సీఎం ఆదేశాలు ఇచ్చారు.

ఇలాంటి వాటిని అడ్డుకునేందుకు రాష్ట్రంలో సైబర్ క్రైం విభాగాన్ని బలోపేతం చేయాలని అన్నారు. అందుకోసం అధునాతన ఫోరెన్సిక్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ టూల్స్‌ను సమకూర్చుకోవాలని సీఎం సూచించారు.

### ఆ భూముల్లో 25 ఏళ్లుగా ఎన్నో భవనాలు

'కంచ గచ్చిబౌలి సర్వే నంబర్ 25లోని భూముల్లో గత పాతికేళ్లుగా అనేక ప్రాజెక్టులు నిర్మించారు. ఐఎస్‌బీతో పాటు గచ్చిబౌలి స్టేడియం, ఐఐఐటీ, ప్రైవేటు భవనాలు, అపార్టుమెంట్లు, హైదరాబాద్ యూనివర్సిటీ భవనాలను నిర్మించారు. అప్పుడు ఎలాంటి ఆందోళనలు జరగలేదు. వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ విధ్వంసం లాంటి వివాదాలు లేనేలేవు. అదే సర్వే నంబర్లోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అభివృద్ధి చేసేటప్పుడు ఎందుకు వివాదాస్పదమైంది?' అంటూ సమావేశంలో చర్చ జరిగింది. 'నెమళ్లు ఆర్తనాదాలు చేసినట్లు ఆడియోలు.. బుల్డోజర్ల ధాటికి జింకలు గాయపడి పరుగులు తీస్తున్నట్లుగా ఫేక్ ఫొటోలు, వీడియోలు తయారుచేశారు. వీటిని కొందరు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయటంతో ఈ వివాదం జాతీయస్థాయిలో చర్చకు దారితీసింది. వాస్తవాలు వెల్లడించేలోగానే అసత్యాలు వైరల్ కావడం ప్రభుత్వానికి సవాలుగా మారింది' అని అధికారులు సీఎంకు వివరించారు.

### ప్రజాస్వామ్యానికే పెనుసవాలు

'ఏకంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ధ్రువ్ రాఠీ, సినీ ప్రముఖులు జాన్ అబ్రహాం, దియా మీర్జా, రవీనాటాండన్ లాంటి వాళ్లందరూ ఏఐ ద్వారా వ్యాపించిన ఫేక్ ఫొటోలు, వీడియోలనే నిజమని నమ్మి.. పోస్టు చేయడం ద్వారా సమాజానికి తప్పుడు సందేశం చేరవేశారు' అని చర్చ జరిగింది. ఈ భూములపై మొదట ఫేక్ వీడియో పోస్ట్ చేసిన జర్నలిస్ట్ సుమిత్‌ఝా కొద్దిసేపట్లోనే తన పోస్టును తొలగించి క్షమాపణలు చెప్పినా.. మిగతా ప్రముఖులు అదే ఫేక్ వీడియోను ప్రచారం చేశారు' అని అధికారులు అభిప్రాయపడ్డారు. కంచ గచ్చిబౌలిలో ఏఐ సృష్టించిన వివాదం ప్రజాస్వామ్య వ్యవస్థలకే పెను సవాలు విసిరిందని ఈ సమావేశం అభిప్రాయపడింది. పాకిస్థాన్, చైనా సరిహద్దు వివాదాలు, ఘర్షణలకు దారితీసే సున్నితమైన అంశాల్లో ఇదే తీరుగా ఫేక్ కంటెంట్ సృష్టిస్తే ప్రమాదకరమన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా తయారు చేసే ఫేక్ వీడియోలు, ఫొటోలు కరోనా వైరస్‌ను మించిన మహమ్మారిలాంటివని సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది.

## శ్రీరామనవమి వేళ.. నేడు అయోధ్యలో ప్రత్యేక ఏర్పాట్లు



అయోధ్య (యూపీ): శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఆదివారం మండుటెండల నడుమ పెద్దసంఖ్యలో అయోధ్య రామాలయాన్ని సందర్శించనున్న భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు పలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వివరాలిలా..

* ట్రాఫిక్ నియంత్రణకు వివిధ డివిజన్లుగా నగర విభజన.. పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ వే మీదుగా భారీ వాహనాల మళ్లింపు
* 2 లక్షలకు పైగా దీపాలతో దీపోత్సవం
* సివిల్ పోలీసులతోపాటు పారామిలిటరీ దళాలతో భద్రత. సరయూనది చుట్టూ ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, వాటర్ పోలీసుల రక్షణ
* రద్దీ ఎక్కువగా ఉండే ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు అన్ని ప్రత్యేక పాసుల రద్దు
* ఇటీవలి మహా కుంభమేళా అనుభవంతో రద్దీ నియంత్రణ చర్యలు
* రామమందిరంతోపాటు హనుమాన్ గఢీ వద్ద చలువ పందిళ్లు, చల్లటి తాగునీరు, 14 తాత్కాలిక ఆరోగ్యకేంద్రాల్లో ఓఆర్ఎస్ పానీయాలు, వైద్యులు, ఏడుచోట్ల 108 అంబులెన్సులు
* డ్రోన్ల సాయంతో భక్తులపై సరయూ జలాల పిచికారీ
* దూరదర్శన్ లైవ్ లింకు ద్వారా ఎల్ఈడీ తెరలపై వేడుకల ప్రత్యక్ష ప్రసారం

## '7 రోజుల్లో దేశాన్ని వీడండి'

వాషింగ్టన్: అగ్రరాజ్య అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటినుంచి వలసల విషయంలో అమెరికా సర్కారు దూకుడు నిర్ణయాలు తీసుకుంటోంది. అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతోంది. వారిని స్వదేశాలకు తిప్పి పంపుతోంది. తాత్కాలిక వలసదారులపైనా కన్నెర్ర చేస్తోంది. ఈ పరిణామాల వేళ వారం రోజుల్లోగా దేశాన్ని వీడాలంటూ వచ్చిన ఓ మెయిల్ అగ్రరాజ్యంలోని ఉక్రెయిన్ పౌరులను హడలెత్తించింది. తర్వాత అది పొరపాటుగా వచ్చిన మెయిల్ అని అధికారులు చెప్పడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. అసలేం జరిగిందంటే.. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించిన తర్వాత ఆ దేశానికి చెందిన పౌరులను ఆదుకునేందుకు అమెరికా ముందుకొచ్చింది. మానవతా పెరోల్ ప్రోగ్రామ్ కింద వారికి అగ్రరాజ్యంలో తాత్కాలిక నివాసం కల్పించింది.

# కన్నుల పండుగగా భద్రాద్రి సీతారాముల ఎదుర్కోలు ఉత్సవం..







ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: శ్రీరామనవమికి భద్రాద్రి రామయ్య దేవాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి సన్నిధిలో జరుగుతున్న తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టాల్లో ఒకటైన ఎదుర్కోలు మహోత్సవం శనివారం కన్నుల పండువగా జరిగింది. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన రాముల వారికి సుగుణాల రాశి సీతమ్మకు జరిగే కల్యాణ మహోత్సవానికి ఒక రోజు ముందు జరిగే ఎదుర్కోలు వేడుక ఆద్యంతం వైభవోపేతంగా జరిగింది. ఋత్వికులు వేద మంత్రోచ్చారణలు, వేద పండితుల ప్రతి సంభాషణల మధ్య వీనుల విందుగా ఈ పండువ సాగింది. ఆలయ పరిసరాల్లో భక్తుల జయజయధ్వానాలు, శ్రీరామ నామస్మరణలతో ఎదుర్కోలు మహోత్సవం వైభవోపేతంగా కొనసాగింది. ఉత్తర ద్వార దర్శనం ఎదురెదురుగా శ్రీ రాములవారు, సీతమ్మ తల్లి ఆశీనులు కాగా వేదపండితులు, అర్చకులు పోటాపోటీగా వారిని కీర్తించారు. వధూవరుల వంశ కీర్తి ప్రతిష్ఠల్ని వేదపండితులు వివరించారు. చూడచక్కని వాడు ప్రపంచానికి ఆనందం పంచేవాడు రామచంద్రుడని రామయ్య తరఫు పురోహితులు కీర్తించగా సుగుణాల రాశి సీతమ్మ వల్లే రామయ్యకు కీర్తి ప్రతిష్ఠలంటూ సీతమ్మ తల్లి తరుపున అర్చకులు అమ్మ వారిని కీర్తించారు. వేద మంత్రోచ్చారణలు, వేద పండితుల సంభాషణల మధ్య ఈ ఎదుర్కోలు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వధూ వరుల వంశాల విశిష్ఠతను వివరిస్తూ సీతారాముల ఔన్నత్యాన్ని అందరికీ చాటి చెప్పారు. సీతారాముల గుణగణాలను కొనియాడారు. చల్లని సీతమ్మకు చక్కని రామయ్య చక్కని జోడి అని వేద పండితులు సంభాషించారు. వారి జంట కనుల పంట అని సీతారాముల వారిని కొనియాడారు.

## ఘనంగా మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబు జగజీవన్ రామ్ జయంతి వేడుకలు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : భారత మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబు జగజీవన్ రామ్ జయంతి సందర్భంగా శనివారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ లో ఘనంగా నిర్వహించారు. దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు మేకల ఎల్లయ్య, మీసాల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జల్దా రాఘవులు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఈ కార్యక్రమంలో రంగా శ్రీనివాస్ గౌడ్, యువజన నాయకులు జల్దా లక్ష్మి నాథ్,వాజీద్, నరసింహ,శ్యామ్, గంగాధర్, బలరాం, రామ్ మోహన్, శ్రీనివాస్, తిమ్మయ్య, సందీప్, దినకర్, దత్తు గౌడ్, ఆనంద్, అప్పారావు, చింటూ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ పార్కు సుందరీకరణ పనులు ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, కాప్రా : ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధిలో భాగంగా మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ పరిధిలోని హెచ్ బీ కాలని వెంకటేశ్వర నగర్ మున్సిపల్ పార్కు సుందరీకరణ పనులు పూర్తికావడంతో ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయంకాల సమయంలో ఆహ్లాదంగా వినోదం కోసం కుటుంబ సభ్యులందరూ కలిసి జిహెచ్ఎంసి పార్కులను ఎక్కువగా సందర్శిస్తూ మనోవుల్లాసాన్ని పొందుతారని, ఈ యొక్క పార్కుల అభివృద్ధి డివిజన్ ప్రజలకు ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తుందని అన్నారు. కార్యక్రమం అనంతరం వెంకటేశ్వర నగర్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు శ్రీపతి, వీరభద్రరావు, బీఆర్ఎస్ నాయకులు వంజరి ప్రవీణ్ కరిపే, గుమ్మడి జంపాల్ రెడ్డి, శ్రీనివాస్, మల్లేష్ గౌడ్, నవీన్ గౌడ్, పూస రమేష్, రామకృష్ణ, దేవేందర్ కుమార్, భూపతి అశోక్, రాంచర్ల బాల నరసింహ, కొయ్యడ జయపాల్, కిరణ్, కుమార్, తిరుపతి, అజయ్, సలీం, నిసార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్ మరియు మహిళా నాయకులు భాగ్యమ్మ, జ్యోతి, భారతి , కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాబు జాగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



ప్రజాస్ఫూర్తి, కాప్రా : బాబు జాగ్జీవన్ రామ్ 117 వ జయంతి పురస్కరించుకొని కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ,అంబేద్కర్ యూత్ కుషాయిగూడ వారి ఆధ్వర్యంలో కుషాయిగూడ కూరగాయల మార్కెట్ యార్డ్ పక్క వీధిలోని బాబు జాగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సింగిరెడ్డి ధన్ పాల్ రెడ్డి, పండాల శివకుమార్ గౌడ్, పనగట్ల చక్రపాణి గౌడ్, చల్లా ప్రభాకర్, కొడకండ్ల యాదయ్య, యాదగిరి, అనిల్ బాబు, యావపురం రవి, చల్లా వెంకటేష్, పండాల గణేష్ గౌడ్, చిదం బాల్నర్సింహా వంశరాజ్, హనుమంతు, దయానంద్, క్రాంతి, సాకేత్, బుడంపల్లి వెంకటేష్, ఉల్లిగడ్డ వెంకటేష్, దుసరి శంకర్, బాలరాజు, నీరుడు బాబు, మల్లేష్, శ్రవణ్, లక్ష్మణ్, కృష్ణ రావు, స్వామి, శ్రీ రాములు, నాని, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 86 మంది మావోయిస్టుల లొంగుబాటు

* వివరాలు వెల్లడించిన మల్టీజోన్ ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన 86 మంది సభ్యులు మల్టీ జోన్-1 ఐజీపీ ఎదుట లొంగిపోయారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. ఆపరేషన్ చేయూత కార్యక్రమంలో భాగంగా ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకుని మావోయిస్టు సభ్యులు లొంగిపోతున్నారని తెలిపారు. ఏసీఎం సభ్యులు 4, పార్టీ సభ్యులు 5, ఆర్పీసీ కమిటీ సభ్యులు 8, ఆర్పీసీ మిలీషియా సభ్యులు 27, ఆర్పీసీ డీఏకేఎంఎస్ సభ్యులు 20, ఆర్పీసీ సీఎంఎం సభ్యులు 13, ఆర్పీసీ జీఆర్డీ సభ్యులు 9 మంది జనజీవనస్రవంతిలో కలిశారని, వారికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కల్పించాల్సిన సౌకర్యాలను కల్పిస్తామని చెప్పారు. గత కొంత కాలంగా నిషేదిత మావోయిస్టు పార్టీ ఆదివాసీ ప్రజలలో ఆదరణ, సమ్మకం కోల్పోయి కాలం చెల్లిన సిద్ధాంతాలతో పాటుగా, బలవంతపు వసూళ్లే లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందితే తమకు మనుగడ ఉండదని భావించి అమాయకపు ఆదివాసీ ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడమే కాకుండా, అమాయకపు ఆదివాసి ప్రజలు నిత్యం సంచరించే ప్రదేశాలలో మందుపాతరలను అమర్చుతూ వారి మరణాలకు ప్రత్యక్ష కారకులవుతున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో మావోయిస్టుల దుశ్చర్యల వలన ఊసురు పోలీస్ స్టేషన్ పరిధిలో రాంపూర్ గ్రామానికి చెందిన ఒక ఆదివాసీ మహిళకు కాలు పోగా, సోడిపార గ్రామానికి చెందిన మరొక ఆదివాసీ మహిళ మరణించిందని వెల్లడించారు. లొంగిపోయి సాధారణ జీవనం గడపాలనుకునే పార్టీ సభ్యులు, వారి కుటుంబ సభ్యుల ద్వారా గానీ, స్వయంగా గాని తమ దగ్గరలో గల పోలీస్ స్టేషన్లను లేదా జిల్లా ఉన్నతాధికారులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. లొంగిపోయిన దళ సభ్యులకు జీవనోపాధి, పునరావాసం కల్పించడం కోసం ప్రభుత్వం తరుపున అందవలసిన అన్ని రకాల ప్రతిఫలాలను అందించడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లప్పుడు కృషి చేస్తుందని ఐజీపీ తెలిపారు.

## అకాల వర్షా నికి నీళ్ల పాలైన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి.

* సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మొన్న కురిసిన అకాల వర్షానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో మొక్కజొన్న, వరి, మిర్చి పంట రైతులను ఎంత నష్టం జరిగిందో పరిశీలించి సత్వరమే రైతులను ఆదుకోవాలని, పరిహారాన్ని వెంటనే చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు.రైతులు ఆరుగాలం కష్టపడి ఎండనక ,వాననక కష్టపడి చేతికి వచ్చిన పంట చేజారిందని బాధల్లో ఉన్న రైతులకు, తీవ్ర నష్టం వల్ల మనస్థాపానికి గురై అనేక సమస్యలకు లోనవుతున్న రైతులకు అండగా ప్రభుత్వం నిలబడాలన్నారు. వ్యవసాయ అధికారులు వెంటనే నష్టపరిహారాన్ని ఎంతవరకు నష్టం జరిగిందో పరిశీలించి నష్టపరిహారం వెంటనే ప్రభుత్వం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంట చేతికి వచ్చిందని సంతోషంగా ఉన్న సమయంలో ప్రకృతి వైపరీత్యం వల్ల భారీ వర్షం కురవడం వల్ల తీవ్ర పంట నష్టం వాటిల్లిన తీరు చూస్తుంటే నష్టం వాటిల్లిన రైతుల కంటనీరు పెడుతుంటే అట్టి బాధలను మరిచే విధంగా ప్రభుత్వం అండగా నిలబడాలని ఆయన అన్నారు. జిల్లా వ్యాప్తంగా పంట నష్టం అంత వాటిలిందో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నాయకులు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తామని ఆయన అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నష్టపోయిన పంటలకు ప్రత్యక్షంగా పర్యటనలు చేసి, పరిశీలించి,నష్టపరిహారం చెల్లించే విధంగా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని రైతులతో మాట్లాడి పంట నష్టపరిహారం చెల్లించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆయన కోరారు.



## హిందుత్వం ముసుగులో ప్రజలను మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

* మాజీ జడ్పిటిసి నాగం కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి
* మొరాయిపల్లిలో జై బాపు, జై బీమ్, జై సంవిధాన్ కార్యక్రమం

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: కేంద్ర ప్రభుత్వం హిందుత్వం ముసుగులో ప్రజలను మోసం చేస్తుందని ఇన్‌ఛార్జి, మాజీ జడ్పిటిసి నాగం కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో భాగంగా శనివారం ముస్తాబాద్ మండలంలలోని మొరాయిపల్లి గ్రామంలో ముస్తాబాద్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో వీధి వీధి గడప గడపకు తిరిగి జై బాపు, జై భీమ్, జై సంవిదన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన రాజ్యాంగం ద్వారానే ఈరోజు మనం ఎంత స్వేచ్ఛగా బతుకుతున్నామని, రాజ్యాంగను మార్చడానికి కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేస్తున్న విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. బిజెపి అధికారంలోకి రావడానికి ముందు దేవుని పేరు చెప్పి, ఇప్పుడు మాయమాటలు చెబుతూ కులాల మధ్య, మతాల మధ్య, చిచ్చు రేపుతుందని మండిపడ్డారు. రాజ్యాంగం ఇచ్చినటువంటి ఆర్టికల్స్‌ను పక్కనపెట్టి కేంద్ర ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ విధ్వంసాలను రెచ్చగొడుతూ చిచ్చు పెడుతూ నయవంచన చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు .ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తీరు మార్చుకోవాలని, లేకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలి

* చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్



ప్రజాస్ఫూర్తి, కాప్రా : రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ అన్నారు. జై బాబు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పాల్గొని ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ ఆధ్వర్యంలో చర్లపల్లి డివిజన్ లో జై బాబు జై భీమ్ జై సంవిధాన్ ప్రోగ్రాం ఇంచార్జ్ గణేష్ నాయక్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కించపరిచేలా బిజెపి ఆర్ఎస్ఎస్ ఏ విధంగా వ్యవహరిస్తున్నాయని, ప్రజలకు తెలియజేసేలా కుషాయిగూడ వీధుల్లో నినాదాలు చేశారు. జాతిపిత గాంధీ చేసిన సేవలు స్వతంత్ర ఉద్యమంలో గాంధీ పాత్ర కాంగ్రెస్ అఖిలభారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికై 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంలో ప్రతి ఒక్కరికి గాంధీ చేసిన సేవలు తెలియజేసే విధంగా జై బాపు కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగం ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తి చేసుకుని రాజ్యాంగ విలువలను కాపాడుట కోసం రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కులు బాధ్యతలు రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ప్రజలకు తెలియజేసేసారు

## ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లు పోలీసుల సూచనలు తప్పక పాటించాలి

- ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్
- ట్రాక్టర్ డ్రైవర్స్, ఓనర్స్‌కు కౌన్సెలింగ్





ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: మండలంలోని ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లు తప్పక పోలీసుల సూచనలు పాటించాలని ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్. గణేష్ సూచించారు. శనివారం ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాక్టర్ ఓనర్లు తమ ట్రాక్టర్లను నడిపేందుకు డ్రైవింగ్ లైసెన్స్ లేని వారిని ఎట్టి పరిస్థితుల్లో నియమించుకోవద్దని, తప్పకుండా లైసెన్స్ ఉన్న వారినే డ్రైవర్లుగా నియమించుకోవాలని సూచించారు. ట్రాక్టర్‌లకు నెంబర్ ప్లేట్లు తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని, ట్రాక్టర్ డ్రైవర్లు ర్యాష్ డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాకు పాల్పడిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాక్టర్ ఓనర్లు, డ్రైవర్లను హెచ్చరించారు.

# నారాయణ పాఠశాలలో హుషారుగా (గ్రాడ్యుయేట్) స్నాతకోత్సవం వేడుకలు







ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచ నెహ్రూనగర్ లోని నారాయణ పాఠశాలలో ఈ కిడ్స్, ఈ చాంప్స్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు పాఠశాల ప్రిన్సిపాల్ పూరేటి నరసింహరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యాక్రమానికి ముఖ్య అతిదులుగా నారాయణ విద్యా సంస్థల ఖమ్మం జోన్ ఏ.జీఎం యోగ రాంకీ, పాల్వంచలోని ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ కిరణ్ కుమార్, ఈచాంప్స్ ఆర్ అండ్ డి హెడ్ స్వాతి లక్ష్మి, హెచ్.ఆర్ సతీష్ లు పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, అనంతరం సాంస్కృతిక కార్యాక్రమాలను ప్రారంబించారు, ఈ సందర్భంగా చిన్నారులు హుషారుగా తమ అద్భుత నృత్య ప్రదర్శనలతో ఆహుతులను విశేషంగా అలరించారు. అనంతరం ఈ కిడ్స్ నుండి ఈ చాంప్స్ కు మరియు 5వ తరగతి నుండి 6వ తరగతి కి వెళ్లుచున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పొందైటప్పుడు ధరించే ప్రత్యేక దుస్తులు ధరింప చేసి, మెడల్స్ తో సన్మానించి, అనంతరం గ్రాడ్యుయేషన్ పట్టాలను ముఖ్య అతిధుల చేతుల మీదుగా అందిచారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధి నారాయణ పాఠశాలల ఖమ్మం ఏ.జీఎం యోగ రాంకీ మాట్లడుతూ విద్యార్థులు విత్తనం లాంటివారని, తల్లితండ్రులు నారాయణ పాఠశాల అనే మంచి భూమిలో నాటారని, ఎంత పెద్ద చెట్టు అయిన వాటి పునాదుల వేర్లు ముఖ్యమని అలాగే చిన్నారుల పునాదులు నారాయణ పాఠశాల వాతావరణంలో ఉండడం వలన, వారి మెదడు నిండా అక్షర జ్ఞానంతో పాటు దయ, జాలి, మంచిచెడు, ప్రేమజాలి గుణాలను నేర్చుకోవడం వలన, వారి పునాదులు బలంగా ఉన్నందున మా నారాయణ విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారని తెలిపారు.ముఖ్య అతిధి డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ప్రాథమిక విద్య ఎంతో కీలకమైనది అని, విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో విద్యను అభ్యసించి ఉన్నత సానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ చాంప్స్ ఆర్ అండ్ డి హెడ్ స్వాతి లక్ష్మి మాట్లాడుతూ తమ పాఠశాలలో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ఎల్.ఎస్.ఆర్. డబ్ల్యూ స్కిల్స్ మీద ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి విద్యార్థి లిజనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్ లో పరిపూర్ణవంతులుగా సిద్ధం చేస్తామని, తమ కరిక్కులంలో ప్రతి ఒక్క పర్వ దినాన్ని నిర్వహిచి వాటిలో విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొనేలా పొందుపరిచామని తెలిపారు. విద్యార్థులు ఎంత క్రమ శిక్షణతో ఉంటారో వారి భవిష్యత్తు అంత ఉన్నతంగా ఉంటారన్నారు.. ఈ కార్యక్రమంలో హెచ్.ఆర్ సతీష్, ఈచాంప్స్ కోఆర్డినేటర్ వినోద, ఈ కిడ్స్ కోఆర్డినేటర్ నీలిమ, ఈటెక్నో ఏ.డి రామకృష్ణ, ఈ చాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ రుచిత శ్రీ , ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ పద్మ , మల్లేష్, వినయ్, ఏ.వో వీర తదితరులు పాల్గొన్నారు.

## పంచశీల పాఠశాలలో ఘనంగా శ్రీ రామ నవమి వేడుకలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : శ్రీ రామ నవమి పర్వదినం సందర్భంగా మూసా పేటలోని పంచశీల పాఠశాలలో శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు సీత రామ లక్ష్మణ, హనుమాన్ వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ మాట్లాడుతూ రామాయణం గురించి వివరించారు. శ్రీరామనవమి రోజు ప్రసాదంగా వడపప్పు, బెల్లం పానకం ఇస్తారని, ఎండ వేడికి ఉపశమనం కలిగిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 7 న రాందేవ్ రావు హాస్పటల్ లో ఉచిత తల్లి–పిల్లల వైద్య శిబిరం

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7న కూకట్ పల్లి లోని రాందేవ్ రావు హాస్పటల్ లో ఉచిత తల్లి-పిల్లల వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హాస్పటల్ వైద్యనిర్వాహకులు ఎం.డి. డాక్టర్ కె. కమలాకర్, సీఈఓ డాక్టర్ యోబు లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్తి బిగినింగ్, హోప్ ఫుల్ ఫ్యూచర్ అనే నినాదాన్ని ప్రకటించిందన్నారు. దీనిలో భాగంగా తల్లి , శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఈ శిబిరం హాస్పటల్ ప్రాంగణంలో ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఇందులో పలు ముఖ్యమైన వైద్య సేవలు ఉచితంగా అందించనున్నారని తెలిపారు. గైనెకాలజీ కన్సల్టేషన్, పీడియాట్రిక్ కన్సల్టేషన్, మామోగ్రఫీ (రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్), హెచ్ పివి వ్యాక్సినేషన్ (మొదటి డోస్), జీఆర్బీఎస్ (రక్తంలో చక్కెర స్థాయి పరీక్ష), పాప్ స్మియర్ వంటి వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలు, తల్లులు, పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రాం జయంతి వేడుకలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : భారత ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రాం 117 వ జయంతి సందర్భంగా శేరిలింగంపల్లి లోని వివేకానంద నగర్ డివిజన్ పరిధిలో గల రిక్షాపుల్లర్స్ కాలనీలో మహనీయునికి మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్లోని బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర రావు, మాచర్ల భద్రయ్య, ఆంజనేయులు, బాబు, యశ్వంత్, ప్రవీణ్, విక్రం, బాబు, మురళి, రాజేందర్, రామచందర్, బాబురావు, సోమయ్య, కె.వి. రావు, జై, కిరణ్, వెంకట్, రాములు, రాజు, రవీందర్, హరీష్, వినయ్, నవీన్, రవి, వెంకటేష్, మురళి, శానప్ప, మోహన్ చారి, రామ్మూర్తి, మాధవి రెడ్డి, శైలజ, అనురాధ, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

## మీర్ పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ లో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి



ప్రజాస్ఫూర్తి, కాప్రా : బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి సందర్భంగా మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ అధ్యక్షులు కొలెపాక అంజయ్య ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా తన పరిపాలన దక్షతతో అఖండ భారతావనికి విశేష సేవలందించి 50 ఏళ్లపాటు పార్లమెంటేరియన్ గా 30 ఏళ్ళు పాటు కేంద్రమంత్రిగా ఆధునిక భారతదేశపు నిర్మణానికి స్ఫూర్తివంతమైన సేవలు అందించి తన జీవితాన్ని సమసమాజ స్థాపన కొరకు కృషి చేసిన ఘనత మన భారత మాజీ ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ కే చెందుతుంది అని వివరించారు. జగ్జీవన్ రామ్ కోరుకున్న అసమానతలు లేని ఒక స్వేచ్ఛయూత ప్రజాస్వామ్యం కోసం ఎనలేని కృషి చేసిన వారి అడుగుజాడల్లో మనం పాయనించాలని హితవు పలికారు. ప్రేమతో మనందరం మననం చేసుకునే "బాపూజీ" దేశ చరిత్రలో తనదైన ముద్ర వేసిన "నేతాజీ" స్వాతంత్ర్య సమర యోధులు, బహుజనుల కై అణగారిన వర్గాల అభ్యున్నతికై సామాజిక స్థాపనకై కదం తొక్కిన సంస్కరణోధ్యమ నేత, మహోన్నతమైన పదవులను అధిష్టించి ఈ దేశపు అభి వృద్ధికి పాటుపడిన ఆదర్శప్రధాత బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆ మహనీయుల స్మృతికి ఘన నివాళి అర్పిస్తున్నాను అని పరమేశ్వర్ రెడ్డి తెలియచేశారు. ఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, జై బాపు, జై బీమ్, జై సంవిధాన్ కోర్డినేటర్ సీతారాం రెడ్డి డివిజన్ అధ్యక్షులు అంజయ్య, శ్రీనివాస్ మల్లికార్జున్, నవీన్, కిషోర్, నరేందర్, మల్లేష్, శ్రవణ్ గౌడ్, రమేష్, వేణు, శ్రీనివాస్, టిల్లు, సురేష్ గౌడ్, సమ్మయ్య, శ్రీకాంత్, వేణు, జెమినీ, లాజర్, అనిల్, నిక్కీగౌడ్, జోసఫ్, అంజయ్య, రాణి, శిరీష యాకూబ్ తదితరులు పాల్గొన్నారు

## రేషన్ షాప్ ల వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటో తక్షణమే పెట్టించాలి

*** వలిగొండ బీజేపీ మండల శాఖ అధ్యక్షులు బోల్ల సుదర్శన్**



యాదాద్రి భువనగిరి , ప్రజాస్ఫూర్తి : అధికారులు చేయవలసిన పనిని స్థానిక ఎమ్మెల్యే ప్రోద్బలం కాంగ్రెస్ కార్యకర్తలు, ఎమ్మెల్యే అనుచరులు కొన్ని గ్రామాల్లో రేషన్ షాపుల వద్ద నిసిగ్గుగా రేషన్ పంపిణీ చేయడాని , అదేవిధంగా అన్ని రేషన్ షాప్ ల వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటో అధికారులు తక్షణమే పెట్టించాలని భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ పక్షాన డిమాండ్ చేస్తూ, కాంగ్రెస్ కార్యకర్తల చేత పంపిణీ చేయడాని తీవ్రంగా ఖండిస్తూ భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ కార్యాలయంలో శనివారం రోజున బోల్ల సుదర్శన్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన ముఖ్యనాయకులు సమావేశంలో మండల అధ్యక్షుడు మాట్లాడుతూ ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో కొన్ని గ్రామాల్లో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు, అక్కడ ఉండే స్థానిక కాంగ్రెస్ నాయకులు రేషన్ పంపిణీ చేయడానికి భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని తెలియజేశారు. అదేవిధంగా రెండు రోజుల క్రితం పార్లమెంట్లో ఆమోదింపబడ్డ వక్స్ బోర్డ్ సవరణ బిల్లు పేద ముస్లింలకు ఎంతో ఉపయోగపడుతుందని , అనేకమంది భూ కబ్జా కోర్ల వద్ద ఉన్నటువంటి భూములు పరిరక్షించబడతాయని సుపరిపాలనకు నరేంద్ర మోడీ పాలన పారదర్శకతకు ఈ వర్క్స్ బోర్డ్ సవరణనే ఒక ఉదాహరణ అని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముఖ్య నాయకులు ఏల చంద్రశేఖర్, కొప్పుల యాద రెడ్డి, కందుల తానేష్, వంద నరసింహ, లోడ లింగస్వామి, మారోజు అనిల్ కుమార్, ఎలిమినేట్ వెంకటేశం, మందుల నాగరాజ, ఎదురుగట్ల వెంకటేశం కార్యకర్తలు పార్టీ అభిమానులు తదితర పాల్గొన్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా అల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పీజేఆర్ చౌక్‌లో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్ రావు పాల్గొని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ స్వగ్రహించిన సమాజ సమానత్వం, పేదల హక్కుల కోసం చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు సాయి గౌడ్, రాము, రాజు, శ్రీనివాస్, అరవింద్, ఖాజా, అనిల్, శేఖర్, శంకర్ గౌడ్, లక్ష్మి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## దైనందిన జీవనంలో క్రీడలతో నూతన ఉత్సాహం

- **రాజన్న సిరిసిల్ల జిల్లా బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకట స్వామి**
- **చిప్పలపల్లిలో విలేజ్ టు విలేజ్ క్రికెట్ టోర్నమెంట్**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: దైనందిన జీవనంలో క్రీడలతో నూతన ఉత్సాహం లభిస్తుందని రాజన్న సిరిసిల్ల జిల్లా బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకట స్వామి అన్నారు. డార్క్ టు లైట్ ఎన్‌జిఓ ఆధ్వర్యంలో ముస్తాబాద్ మండలంలోని చిప్పలపల్లి గ్రామ శివారులో జరుగుతున్న విలేజ్ టు విలేజ్ క్రికెట్ టోర్నమెంట్‌కు శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. యువత మొబైల్ ఫోన్లలోని ఆన్లైన్ గేమ్స్‌కు దూరంగా ఉండి, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుంటే మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటారని అన్నారు. అదేవిధంగా ఉన్నత చదువులు చదివి మానవత విలువలు పెంపొందించుకుని బీసీ స్టడీ సర్కిల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ, కేంద్రప్రభుత్వ ఉద్యోగాలకు ఇస్తున్న ఉచిత శిక్షణా తరగతులను ఉపయోగించుకొని ఉన్నత స్థాయిలో ఉండాలని యువకులకు ప్రోత్సాహం నింపారు. డార్క్ టు లైట్ ఎన్‌జిఓ ద్వారా అనేక కార్యక్రమాలు చేస్తున్న బొడ్డు తిరుపతిని ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు విజయ్, సంపత్, అబ్బు, ముడపెల్లి రాజు, సాయి తదితరులున్నారు.

## దేశ ఉప ప్రధానిగా స్ఫూర్తివంతమైన సేవలందించిన బాబు జగ్జీవన్ రామ్

- **ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలోనూ... స్వరాజ్యం వచ్చాక ఆధునిక భారత దేశ నిర్మాణంలోనూ ఉప ప్రధానిగా బాబు జగ్జీవన్ రామ్ స్ఫూర్తివంతమైన సేవలు అందించారని మాజీ సర్పంచ్ కాశోల్ల పద్మ దుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పరశురాములు అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలను ముస్తాబాద్ మండలంలోని తుర్కపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి వారు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల రహిత సమాజం కోసం, అట్టడుగు వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయులు బాబు జగ్జీవన్ రామ్ కొనియాడారు. మహనీయుడు బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా మనకు హక్కులను ప్రసాదిస్తే, వాటిని చట్టరూపంలో తీసుకురావడానికి కృషి చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. గొప్ప రాజకీయ వేత్తగా సామాజిక సమానత్వం కోసం జీవిత కాలం పోరాడారని, అనేక పదవులను చేపట్టి తనదైన ముద్రను వేశారని అన్నారు. జగ్జీవన్ రాం జీవిత పర్యంతం బడుగు వర్గాల అభ్యున్నతికై కృషి చేశారని తెలిపారు. దేశ రక్షణ మంత్రిగా బాబూ జగ్జీవన్ రాం వేసిన బాటలు దేశాన్ని సురక్షితంగా ఉంచాయని అన్నారు. మనం అందరం కలిసి పని చేసి సమాజం, రాష్ట్రం అబివృద్ధి కోసం మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకపోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు జోగెల్లి నాగరాజు, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మల్లేష్, మచ్చ లింగం, రాజనర్సు, రామస్వామి, ఎల్లయ్య, లక్ష్మణ్, కృష్ణ, ప్రశాంత్, ఎఎన్ఎం, అంగన్వాడీ కార్యకర్త, ఆశావర్కర్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం ముఖ్యమంత్రి ఆమోదం

* అభివృద్ధి దిశగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
* ఫలించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారు. మైనింగ్ కళాశాలను అప్ గ్రేడ్ చేస్తూ యూనివర్సిటీగా మారుస్తున్నట్లు ప్రకటించారు. సీఎం ప్రకటనతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శ్రమ ఫలించింది. అన్ని సహజ వనరులు మెరుగైన అవకాశాలు ఉన్న మైనింగ్ కళాశాలను ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంగా అప్ గ్రేడ్ చేయాలని మంత్రి తుమ్మల పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతి పత్రాలు అందచేసిన విషయం తెలిసిందే. మంత్రి తుమ్మల విజ్ఞప్తి మేరకు సీఎం రేవంత్ సానుకూలంగా స్పందించి యూనివర్సిటీని మంజూరు చేస్తూ ప్రకటన జారీ చేశారు. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. సహజ వనరులు, మినరల్స్ ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం ఏర్పాటుతో అంతర్జాతీయ ఖ్యాతి లభించనుంది. దేశంలోనే మొట్టమొదటి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ని కొత్తగూడెం జిల్లాలో మంజూరు చేయడం ఉమ్మడి



జిల్లాకు లభించిన గొప్ప గౌరవంగా చెప్పవచ్చు.

*** 300 ఎకరాల్లో విశ్వవిద్యాలయం....**

సింగరేణి స్కూల్ ఆఫ్ మైన్స్ దేశంలోనే ఎక్కడా లేనివిధంగా 300 ఎకరాల్లో విశ్వవిద్యాలయం రూపుదిద్దుకోనుంది. అత్యున్నత ప్రమాణాలతో వేలాదిమందికి విద్య ఉపాధి అవకాశాలకు కేంద్రంగా మారనుంది. మైనింగ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా మార్చడం ద్వారా వేలాదిమంది యువ శాస్త్రవేత్తల ఇక్కడి నుంచే దేశ భవిష్యత్తుకు బాటలు వేయనున్నారు. నాగరికతతో పాటు పెరుగుతున్న జనాభా అవసరాలు తీర్చడంలో సహజ వనరులు కీలక పాత్ర పోషిస్తాయి. ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సుల అమలుతో జాతీయస్థాయిలో కార్యకలాపాలు విస్తరించే అవకాశం ఉంది.

*** ఫలించిన మంత్రి తుమ్మల కృషి....**

అపర చాణిక్యుడిగా...అభివృద్ధి ప్రదాతగా, విజన్ కలిగిన నేతగా మంత్రి తుమ్మలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అభివృద్ధిలో పట్టు వదలని విక్రమార్కుడిలా పనిచేయడం ఆయన నైజం. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు ఉమ్మడి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు, ప్రత్యేక వ్యవహార శైలి కలిగిన మంత్రి తుమ్మల అభివృద్ధికి తొలి ప్రాధాన్యత నిస్తూ అభివృద్ధి ప్రదాతగా పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం మైనింగ్ కళాశాలను అప్గ్రేడ్ చేసి ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంగా మార్చాలని పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసి వినతి పత్రాలు లేఖలు అందించి తన పంతం నెగ్గించుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటేలా, దేశంలోనే మొట్టమొదటి ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. తన అభ్యర్థనను పరిగణలోకి తీసుకుని ప్రతి అంశాన్ని ప్రతి పనిలో సహకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి కి మంత్రి తుమ్మల ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

*** భద్రాద్రికి మహర్దశ... యువతకు ఉద్యోగం...**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మహర్దశ పట్టనుంది. మైనింగ్ కళాశాలను ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ గా మార్చి మంజూరు చేయడంతో ఈ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. వేలాది మంది విద్యార్థులు ఉన్నత చదువులకు అవకాశాలు లభించడంతో పాటు శాస్త్రవేత్తలుగా తయారయ్యే అవకాశాలు ఉన్నాయి. ఎర్త్ సైన్సెస్ వర్సిటీతో జియో కెమిస్ట్రీ, జియో ఫిజిక్స్, ప్లానెట్రీ జియాలజీ, జియో మేరపాలజీ, స్ట్రక్చర్ జియాలజీ, ఖనిజ శాస్త్రం, పర్యావరణ భూగర్భ శాస్త్రం వంటి విభిన్న కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్ర స్థాయిలో ప్రవేశాలు కల్పించే అరుదైన అవకాశం లభించనుంది. దేశంలోని అన్నిరాష్ట్రాల నలుమూలల నుంచి విద్యార్థులకు చదువుతో పాటు ఉపాధి అవకాశాలు లభించాయి.

*** ప్రత్యేక వనరులు... దేశ స్థాయిలో ఖ్యాతి...**

భద్రాద్రి కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ విద్యాలయానికి దేశ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించనుంది. ఇక్కడ బొగ్గుతో పాటు అన్ని ఖనిజాలు (సహజ వనరుల) ఉన్నాయి. దక్షిణ భారతదేశంలో ఖనిజ నిధిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు పేరుంది. ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు అన్ని అనుకూల వసతులు ఉన్నాయి. నేషనల్ హైవే కి సమీపంలో 300 ఎకరాల్లో ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నారు. విశ్వవిద్యాలయానికి సమీపంలో మినీ స్టీల్ ప్లాంట్, నావా లిమిటెడ్ , ఫెరో ఎల్లాయి, ఫెర్రో మెగ్నిషియం, విద్యుత్ ప్లాంట్ ఉన్నాయి. విద్యుత్ ప్లాంట్లు కూడా మరో 300 మెగావాట్ల సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ ప్రాంతానికి సమీపంలో ఐటీసీ పేపర్ బోర్డ్, హెవీ వాటర్ ప్లాంట్ ఉన్నాయి. ఈ ప్రాంతానికి 20 కిలోమీటర్ల దూరంలో విమానాశ్రయాన్ని ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. త్వరలో ఈ కల నెరవేరనుంది. రోడ్డు , రైలు రవాణా మార్గాలు ఈ ప్రాంతానికి అతి సమీపంలో ఉన్నాయి. 35 కిలోమీటర్ల దూరంలో గోదావరి నది ప్రవహిస్తుంది. దీనివల్ల భవిష్యత్తులో నీటి ఇబ్బందులు ఉండవు. అన్ని అవకాశాలు ఉన్న దృష్ట్యా ఇక్కడ ఎర్త్ సైన్సెస్ విద్యాలయం ఏర్పాటుకు అనుకూల అంశాలుగా ప్రభుత్వం గుర్తించింది.

## ఘనంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



యాదాద్రి భువనగిరి , ప్రజాస్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలోని చౌరస్తా లో డాక్టర్, బీ ఆర్ అంబెద్కర్ విగ్రహనికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ వన్ రామ్ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్.ఎ.ఎల్ అంబేద్కర్ భవన్ లో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : దళిత జన బాంధవులు మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతిని హెచ్.ఎ.ఎల్ అంబేద్కర్ భవన్ లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా హెచ్.ఎ.ల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామ్మోహన్ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీహార్ రాష్ట్రం లో జన్మించిన బాబు జగ్జీవన్ రామ్ భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. సామాజిక న్యాయం సమానత్వం కోసం, ముఖ్యంగా అణచివేతకు గురైన వారి కోసం పోరాడారన్నారు. దళితుల హక్కులు వారి సామాజికఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడానికి కృషి చేశారన్నారు. లోక్‌సభకు ఎన్నికై కేంద్ర మంత్రి గా వివిధ క్యాబినెట్ పదవులను నిర్వహించారని డిఫెన్స్ మినిస్టర్ హోదా లో హెచ్.ఎ.ల్ పరిశ్రమకు విచ్చేసారని వారు పేర్కొన్నారు. చీఫ్ ఆఫ్ ప్రాజెక్ట్స్ మురళీకృష్ణ, డీజీ యమ్ హెచ్.ఆర్ సూర్యకుమార్ రౌత్, గుర్తింపు యూనియన్ అధ్యక్షులు వేంకటాద్రి, గౌరవ అధ్యక్షులు విజయప్రసాద్, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్స్ గణేష్, కర్కనాగరాజు, చంద్రరావు నాయక్, కూతడి కృష్ణా, సురేష్, నాగార్జున, వెంకటేష్, ఎస్సీ అసోసియేషన్ అధ్యక్షులు పట్టు రమేష్, ప్రధాన కార్యదర్శి శశికుమార్, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు చూడమన్, ఓబీసీ అసోసియేషన్ అధ్యక్షులు రవికుమార్ ముదిరాజ్, విజయశ్రీ, ధనలక్ష్మి, పద్మజ, గడ్డం రమేష్, శంకర్, మురళి, ఉప్పలయ్య, బాబీ, సుదర్శన్, సృజన్, ప్రవీణ్ అన్ని యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

## విదేశాలకు అక్రమంగా డబ్బును బదిలీ చేస్తున్న ముగ్గురి అరెస్టు

హైదరాబాద్: విదేశాలకు అక్రమంగా డబ్బును బదిలీ చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. డ్రగ్స్ విక్రయం ద్వారా వచ్చిన డబ్బును ఈ ముఠా విదేశాలకు తరలిస్తోంది. ఈ ఘటనలో ముగ్గురు నైజీరియన్లను తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు డార్క్ వెబ్, ఫారెక్స్ మనీ ఏజెంట్ల ద్వారా మనీలాండరింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించారు. వారి నుంచి రూ.12.50 లక్షల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. భారత్‌తో పాటు అమెరికాలోనూ వీరు డ్రగ్స్‌ను విక్రయించారు. అమెరికాలో యువతులను ట్రాప్ చేసి డబ్బును భారత్‌కు పంపిస్తున్నారు. అమెరికా పోలీసుల నుంచి తప్పించుకునేందకు నగదును భారత్‌కు బదిలీ చేస్తున్నారు. ఇక్కడి నుంచి అక్రమ మార్గంలో సొంత దేశం నైజీరియాకు దీన్ని పంపిస్తున్నారు.

## కిషన్ రెడ్డిపై రాజాసింగ్ విమర్శలు..
# స్పందించిన బండి సంజయ్

* బీజేపీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అన్న బండి సంజయ్
* రాజాసింగ్ అంకితభావం, కష్టపడే తత్వం కలిగిన నాయకుడన్న బండి సంజయ్
* అంతర్గత విషయాలపై మీడియా ముందుకు రావొద్దని సూచన



బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం వ్యవహారానికి సంబంధించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఉద్దేశించి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. బీజేపీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, వ్యక్తిగత ఆలోచనలకు అనుగుణంగా నిర్ణయాలు ఉండవని ఆయన స్పష్టం చేశారు. తన సిఫార్సులను కూడా పార్టీ కేంద్ర నాయకత్వం ఎల్లప్పుడూ ఆమోదించలేదని ఆయన తెలిపారు. అదే సమయంలో ఆయన రాజాసింగ్‌పై ప్రశంసలు కురిపించారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీకి రాజాసింగ్ అంకితభావంతో, కష్టపడి పనిచేసే నాయకుడని అన్నారు. అయితే పార్టీ అంతర్గత విషయాలపై మీడియా ముందుకు రావొద్దని, పార్టీలోనే చర్చించుకోవాలని సూచించారు. పార్టీలోని చిన్న చిన్న అంతరాలను బయటకు తీసుకువచ్చి పెద్దగా చేయకూడదని అన్నారు. అలాంటి చర్యలు పార్టీకి నష్టం చేస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను త్వరగా పూర్తి చేయాలి : ఉత్తమ్ కుమార్ రెడ్డి

* నీటి పారుదల శాఖ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం
* ప్రాజెక్టు మొదటి దశను ఈ ఏడాది డిసెంబర్ లోపు పూర్తి చేయాలన్న మంత్రి
* డిసెంబర్ నాటికి 50 టీఎంసీలు నిల్వ చేస్తామని వెల్లడి

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని సత్వరం పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు మొదటి దశను ఈ సంవత్సరం డిసెంబరు నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ మేరకు నీటి పారుదల శాఖ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నార్లాపూర్, ఏదుల జలాశయాల మధ్య ఉన్న రెండో ప్యాకేజీ పనులను వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు. కాలువల నిర్మాణ పనులను అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. జలాశయాల పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని వెల్లడించారు. డిసెంబర్ నాటికి పనులన్నీ పూర్తి చేసి 50 టీఎంసీల నీటిని నిల్వ చేస్తామని ఆయన పేర్కొన్నారు. సబ్ స్టేషన్ల పనుల నిమిత్తం ట్రాన్స్‌కోకు రూ. 262 కోట్లు విడుదల



చేశామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. జులై నెలలో పంపుల డ్రై రన్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జూరాల ప్రాజెక్టులో పూడికతీత పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

## ట్రంప్ నుంచి నేర్చుకోవాలి – అఖిలేశ్ యాదవ్

లఖ్‌నవూ: మన ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవాలంటే ఇతర దేశాలనుంచి వచ్చే దిగుమతులపై సుంకాలు విధించాలని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ సూచించారు. ఈ విషయంలో మోదీ ప్రభుత్వం.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి నేర్చుకోవాలన్నారు. లఖ్‌నవూలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన కేంద్రంతోపాటు యూపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ''అమెరికా అధ్యక్షుడిని చూసి మన ప్రభుత్వం నేర్చుకోవాలి. ఆయన తన దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకునేందుకు అన్ని దేశాలపై సుంకాలు విధించారు. దీని



నుంచి పాఠాలు నేర్చుకొని.. మనం కూడా చైనాపై ఆంక్షలు విధించాలా, వద్దా? అమెరికా నుంచి పాఠాలు నేర్చుకోవాలి. మన ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవాలంటే ఇతర దేశాలపైనా మనం సుంకాలు విధించాలి'' అని అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. ప్రస్తుతం దేశ ఆర్థికవ్యవస్థ తీవ్ర సవాల్‌ను ఎదుర్కొంటోందన్న అఖిలేశ్.. ఉచితంగా రేషన్ పొందుతున్న వారి తలసరి ఆదాయం ఎంత ఉందో తెలుసుకుంటే అర్థమవుతుందన్నారు. మన ఆర్థిక వ్యవస్థ గురించి తప్పుడు లెక్కలు చూపెడుతున్నారని ఆరోపించారు. ఇక వక్ఫ్ సవరణ బిల్లుపై మాట్లాడుతూ.. గోరఖ్‌పుర్, అయోధ్యల్లో ఉన్న వక్ఫ్ ఆస్తులు కాజేసేందుకు కాషాయ పార్టీ ప్రయత్నాలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి దారుణంగా ఉందని, నేరస్థులపై ఉక్కుపాదం మోపుతామని చెప్పిన యోగి ప్రభుత్వం ఇప్పుడు మౌనంగా ఉందని ఎద్దేవా చేశారు.



# ఇంటి నుంచి పని చేస్తున్నారా!

ఇంటి నుంచి పనిచేసే ఉద్యోగ అవకాశాలు ఇప్పుడు ఎక్కువగానే ఉంటున్నాయి. పని ప్రదేశం అందుకు తగ్గట్లు లేకపోతే ఏకాగ్రత దెబ్బతింటుంది. ఒత్తిడీ తప్పకపోవచ్చు. కాబట్టి, ఇంట్లో దీనికంటూ ఓ ప్రత్యేక స్థలాన్ని ఎంచుకోవాలి. మనసుకు నచ్చేలా మాత్రమే కాకుండా మెదడు ఉత్సాహంగా పనిచేసేలానూ దీన్ని సర్దుకోవాలి. అదెలాగో చూద్దాం.

**మధ్యగది వద్దు...**

వర్క్‌ఫ్రమ్ హోమ్ చేసేందుకు... ఇంటి మధ్యలో ఉండే గదిని ఎంచుకోవద్దు. బెడ్‌రూమ్‌కి పక్కగా ప్రశాంతంగా ఉండే చోట ఇందుకు ఏర్పాట్లు చేసుకోండి. ఆకర్షణీయంగా ఉండే రంగులూ, కోట్స్‌తో తీర్చిదిద్దితే స్ఫూర్తిమంతంగా ఉంటాయి. వర్ణాలు మనసుని ఉల్లాసంగానూ ఉంచుతాయి. పని ఒత్తిడినీ దూరం చేస్తాయి.

**ఒద్దికగా సర్దితే...**

గదిలో అలంకరణగా సర్దే వాల్ హ్యాంగింగ్స్ నుంచి టేబుల్‌పై అమర్చే పుస్తకాలు, ఫైల్స్ ఆర్గనైజర్, ల్యాంప్, మౌస్‌ప్యాడ్, పెన్ హోల్డర్, టేబుల్‌క్లాక్, ఆర్గనైజర్ ట్రే వంటి వస్తువులన్నీ మిక్స్ అండ్ మ్యాచ్ కలర్స్‌లో ఉంటే ఆ ప్రాంతం మరింత అందంగా మారిపోతుంది. అలాగే ల్యాప్‌టాప్‌కెదురుగా ఉండే గోడకు సప్తవర్ణాల తాళ్లతో అల్లిన వాల్ హ్యాంగింగ్ బాగుంటుంది. ఇది గది లుక్‌ను మార్చేస్తుంది. గది చిన్నదైతే కార్పెట్ ఎంపిక కాకుండా జామెట్రిక్ డిజైన్‌లో ముదురు, లేత రంగుల కలయికతో కంటికింపుగా కనిపించే త్రికోణం, గుండ్రని లేదా చతురస్రాకారంలో ఉండే రగ్ పరవాలి.

**కలర్‌ఫుల్‌గా...**

ఇక, టేబుల్‌కు పక్కగా ఉండే అలమరలో రంగురంగుల తొట్టెల్లో ఇండోర్ పూలమొక్కలు సర్దాలి. సౌకర్యవంతమైన డెస్క్ చెయిర్ సౌకర్యంగా ఉంచుతుంది. అంతేకాదు, ఇందులో వేసే కుషన్ కవర్ డిజైన్ సైతం కలర్‌ఫుల్‌గా కనిపించాలి. దీంతోపాటు గదిలోని మాగ్నటిక్ బులెటెన్ బోర్డు సైతం ముదురు వర్ణంలో ఉండాలి. ఇక గది కిటికీకి విలక్షణమైన డిజైన్స్ ఉన్న ముదురు, లేత రంగుల కలయికతో ఉన్న కర్టెన్లు వేస్తే చాలు. రోజంతా పని చేసినా అలసట అనిపించదు. పనిలో నాణ్యతా పెరుగుతుంది.

# ఏ డ్రెస్‌కి ఎలాంటి బ్రా!

ఏ దుస్తులు వేసుకున్నా అవి సౌకర్యాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ ఇవ్వాలంటే ఎంచుకునే లోదుస్తుల ఎంపికా సరిగా ఉండాలి. ముఖ్యంగా బ్రాల్లో ఎన్నో రకాలు ఉంటాయని చాలా తక్కువ మందికి తెలుసు. వాటిని ఎలా ఎంచుకోవాలంటే...

* టీ షర్ట్ బ్రా: టైట్ ఫిట్టింగ్, టీషర్ట్‌లు, కుర్తీలు, బాడీ హగ్గింగ్ డ్రెస్‌లకు సరైన ఎంపిక ఇది. సీమ్‌లెస్ కప్స్, లైట్ ప్యాడింగ్‌తో ఉండటం వల్ల దుస్తుల లోపలి బ్రాలైన్స్ కనిపించవు. సహజ ఆకృతిలో సౌలభ్యంగానూ ఉంటాయి.
* స్ట్రాప్‌లెస్ బ్రా: ఆఫ్‌షోల్డర్ డ్రెస్‌లు, ట్యూబ్ టాప్స్ కోసం వీటిని ఎంచుకోవాలి. భుజాలపై స్ట్రాప్స్ లేకపోవడం వల్ల దుస్తుల అందం దెబ్బతినదు.



సిలికాన్‌లైనింగ్ లేదా వైడ్ బ్యాండ్‌లు వీటిని పట్టి ఉంచుతాయి.

* ప్లంజ్ బ్రా: డీప్ వీ నెక్ డ్రెస్‌లు, లోకట్ కుర్తీలు, ప్లంజింగ్ నెక్‌లైన్ బ్లవుజులకు, పార్టీ గౌనులకు అనువైనది. ఈతరహా దుస్తులు వేసుకున్నప్పుడు అసౌకర్యాన్ని కలగనీయదు.
* బ్యాక్‌లెస్ బ్రా/స్టిక్‌ఆన్‌బ్రా: బ్లాక్‌లెస్ బ్లవుజులు, లోబ్యాక్ డ్రెస్‌లు, షీర్ గౌన్‌లు లెహంగాలు వంటివి వేసుకున్నప్పుడు దీన్ని ఎంచుకోవాలి. స్ట్రాప్స్ లేని ఈ బ్రా సిలికాన్ లేదా అడ్హెసివ్ కప్స్‌తో చర్మాన్ని అతుక్కుంటుంది.
* కన్వర్టబుల్ బ్రా: హాల్టర్ నెక్ డ్రెస్‌లు, క్రిస్ క్రాస్ బ్యాక్ టాప్స్... వంటివాటికి ఇది సరిగ్గా నప్పుతుంది. అవసరాన్ని బట్టి దీని స్ట్రాప్స్‌ని తీసేయొచ్చు. లేదా అవసరానికి అనుగుణంగా సర్దుబాటు చేసుకోవచ్చు. దీన్ని మల్టీపుల్ విధానాల్లో ఉపయోగించుకోవచ్చు.
* పుషప్ బ్రా: లోకట్ డ్రెస్‌లకు నప్పే రకం ఇది. అండర్‌వైర్, ప్యాడింగ్ సాయంతో తక్కువ ఛాతీ ఉన్నవారు ఈ తరహాను ఎంచుకోవచ్చు.
* స్పోర్ట్స్ బ్రా: యాక్టివ్ వేర్, జిమ్ వేర్, క్యాజువల్ కుర్తీలకు ఇది అనువైనది. వర్కవుట్లు చేసేటప్పుడు బ్రెస్ట్‌కి సరైన సపోర్ట్ ఇస్తుంది. తేమను గ్రహించి సౌకర్యంగా ఉంచుతుంది. డైలీ వేర్‌కోసమూ వీటిని వాడొచ్చు.

# డిజైన్ చేద్దామా... గోళ్లనీ?

**దుస్తులు, సందర్భం బట్టి ఎలా సిద్ధమవ్వాలో నిర్ణయించుకుంటారు అమ్మాయిలు. వాటిల్లో గోళ్లదీ ప్రధాన పాత్రే. అలాంటప్పుడు కేవలం నెయిల్ పాలిష్ ఏం సరిపోతుంది? వాటికీ ప్రత్యేక అలంకరణలు కావాలి. అందుకు సాయపడేవే ఇవి!**

**రాళ్లు అద్దేయండి...**

ఈ దుస్తులకు బంగారు నగలు... వీటికి స్టోన్‌వి అంటూ నిర్ణయించుకుంటాం కదా! అలాంటప్పుడు నెయిల్‌పాలిష్ విషయంలో మాత్రం ఎందుకు తగ్గాలి? వాటినీ దుస్తులకు తగ్గట్టుగా డిజైన్ చేసుకుంటేసరి. అందుకు సాయపడేవే ఈ క్రిస్టల్స్, ముత్యాలు, రంగుల రాళ్లు వగైరా. నెట్టింట వెతకండి బోలెడు రకాలు దొరుకుతాయి.








నెయిల్‌పాలిష్ వేసి పైన వీటిని గమ్‌తో అతికించడమే. గోళ్లూ మెరిసిపోతాయి.

**జెల్ చూశారా?**

నెయిల్ పాలిష్ తెలుసు. మరి ఈ జెల్ ఏంటి అంటే... నచ్చినరంగు వేసుకున్నాక పైన మెరవడానికి కలర్‌లెస్ దానితో కోట్ వేస్తుంటాం. ఇన్ని తిప్పలు ఎందుకు? దానంతట అదే మెరిస్తే పోలా అన్న ఆలోచనకు సమాధానంగా వచ్చిందే జెల్ పాలిష్. దీన్ని నెయిల్‌పాలిష్‌లా వేసుకుంటే చాలు... షిమ్మరీ లుక్ వచ్చేస్తుంది. పైగా ఇది రెండు మూడు రోజులకే పోదు. చాలా రోజులు వస్తుంది. చివరివరకూ డల్‌గానూ అవ్వదు.

**నగలద్దండి...**

గోళ్లకీ నగలు, పూలు, త్రీడీ బొమ్మలంటూ ఎన్నెన్ని అతికించేస్తున్నారో కదా! అన్నీ ఏం కొనిపెట్టుకుంటాం? పోనీ సృజనాత్మకతకు పని పెడదామా? అయితే నెయిల్ కార్వింగ్ జెల్ తెచ్చుకోండి. చిన్నప్పుడు స్లైమ్, క్లేతో బొమ్మలు చేసుంటారుగా! ఇదీ అలాంటిదే కాకపోతే గోళ్లకోసం ప్రత్యేకంగా తెచ్చారంతే. దీంతో గోళ్లమీదే చిన్న చిన్న నగలు, పూలు వంటివి బోలెడు ప్రయత్నించొచ్చు. తగ్గట్టుగా వాటిని హైలైట్ చేసుకుంటే చాలు. బోలెడు రంగుల్లో దొరుకుతున్నాయి. గోళ్లకి ప్రత్యేకతను తెస్తూనే మీ సృజనాత్మకతనూ బయటపెడుతుంది. ప్రయత్నించండి మరి!

# సీతాకోకల చెలి... సొసైటీ లిల్లీ!

లిల్లీలను పోలి ఉండే ఊదారంగు పూలు, వెల్లుల్లిని తలపించే వాసనతో... వినూత్నంగా కనిపిస్తుంది సొసైటీ గార్లిక్ మొక్క. దీన్ని ఇంటిముందు కాలిబాటల పక్కనే కాదు... బాల్కనీలోని కుండీల్లోనూ సులువుగా పెంచుకోవచ్చు. మరి ఆ వివరాలేంటో తెలుసుకుందామా! గడ్డిలా కనిపించే ఆకులూ, గుత్తుల్లో విచ్చుకునే లావెండర్ కలర్ పూలతో భలేగా ఆకట్టుకుంది ఈ మొక్క. పూల కాడలు దాదాపు రెండడుగుల పొడవుండి, ఆకుల నుంచి పైకి వచ్చి కనబడుతుంటాయి. ఉల్లి కుటుంబానికి చెందిన దీన్ని సొసైటీగార్లిక్ అనీ, పింక్ అగపాంథస్ అనీ అంటారు. దీని శాస్త్రీయ నామం తుల్‌భాగియా వయోలేసియా. దుంపలతో మొలకెత్తుతుందీ మొక్క. అలంకరణకోసం దీన్ని ఎక్కువగా పెంచుతారు. ఒక్కసారి నాటుకుంటే చాలు ఏళ్లపాటు పెరుగుతుంది. సొసైటీ గార్లిక్ సంరక్షణ కూడా సులువే. ఎలాంటి నేలలో అయినా చక్కగా కుదురుకుంటుంది. పూర్తి సూర్యకాంతిలోనే కాదు... పాక్షిక నీడలోనూ నాటుకోవచ్చు.







# ట్రంప్ ప్రతీకార సుంకాలు..

**మూడురోజుల్లోనే రూ.10వేలకోట్లకుపైగా పెట్టుబడుల ఉపసంహరణ..!**



**ముంబై:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాలను ప్రకటించనున్నారన్న నివేదికల మధ్య ఏప్రిల్ తొలివారంలో విదేశీ పెట్టుబడిదారులు భారత ఈక్విటీ మార్కెట్‌లో భారీగా అమ్మకాలు జరిపారు. నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ డేటా ప్రకారం.. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు ఏప్రిల్ 2 నుంచి ఏప్రిల్ 4 మధ్య రూ.10,355 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించారు. పెరుగుతున్న ప్రపంచ అనిశ్చితి, సుంకాల నేపథ్యంలో మార్కెట్లకు ఉన్న పొంచి ఉన్న ముంపు నేపథ్యంలో అమ్మకాలు జరిగాయి. మార్చిలో ఎఫ్‌పీఐ అమ్మకాలు ఫిబ్రవరిలో కంటే చాలా తక్కువగా ఉన్నాయి. మార్చిలో మొత్తం అమ్మకాలు ఫిబ్రవరిలో రూ.34,574 కోట్లతో పోలిస్తే.. రూ.3,973 కోట్లకు తగ్గాయి. కానీ, ఏప్రిల్ తొలివారంలోనే ప్రపంచ మార్కెట్‌లో గందరగోళం మొదలైంది. దాంతో పెట్టుబడిదారుల సెంటిమెంట్ దెబ్బతిన్నది. ఈ క్రమంలో మళ్లీ అమ్మకాలు ప్రారంభించారు. అయితే, విదేశీ పెట్టుబడిదారులంతా కేవలం భారత్‌లో మాత్రమే అమ్మకాలు జరుపుతున్నారని కాదు. సుంకాలు ప్రకటించిన రెండు రోజుల్లోనే యూఎస్ మార్కెట్ మాత్రమే దాని మొత్తం మార్కెట్ క్యాప్‌లో దాదాపు 5.4 ట్రిలియన్ డాలర్లను కోల్పోయింది.

మార్కెట్ నిపుణుడు అజయ్ బగ్గా మాట్లాడుతూ.. సమీప భవిష్యత్‌లో భారత మార్కెట్లలో బలమైన విదేశీ పెట్టుబడుల ప్రవాహనం కొనసాగే అంచనా లేదన్నారు. ట్రంప్ సుంకాలతో ఏర్పడిన గందరగోళం కొంత వరకు తగ్గుముఖం పట్టే వరకు మార్కెట్‌లో పెట్టుబడులు ఇప్పుడే ఉంటాయని ఆశించడం లేదన్నారు. పెట్టుబడిదారుల సెంటిమెంట్ మెరుపడేందుకు కొన్ని నెలల సమయం పడుతుందని.. అయితే, భారత్ అమెరికాతో ఇతర దేశాల మధ్య జరుగుతున్న ప్రధాన వాణిజ్య చర్చలు త్వరలో ముగిస్తే ప్రస్తుత పరిస్థితి వేగంగా మారేందుకు ఛాన్స్ ఉంటుందన్నారు. మార్కెట్ సెంటిమెంట్ మెరుగయ్యేందుకు నెలల సమయం పటవచ్చుని.. అయితే, సుంకాలు భారతదేశంపై ఎలాంటి ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశం లేదని బగ్గా తెలిపారు. అమెరికాకు చేసే 80 బిలియన్ డాలర్ల భారత ఎగుమతులు భారత ఆర్థిక వ్యవస్థ స్థాయి 4.2 ట్రిలియన్ డాలర్లతో పోలిస్తే.. చాలా తక్కువగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం అస్థిరత ఉన్నప్పటికీ, భారత ఈక్విటీ మార్కెట్లు ప్రాథమికంగా బలంగా ఉన్నాయని నిపుణులు భావిస్తున్నారు. కానీ, ప్రపంచ మార్కెట్‌లో అస్థిరత నేపథ్యంలో విదేశీ పెట్టుబడులు భారీగా ఉపసంహరించుకునే అవకాశాలున్నాయి.

## భారత మార్కెట్‌లో ఈవీ కార్ల క్యూ..




**న్యూఢిల్లీ:** భారతీయ ఆటో మొబైల్ మార్కెట్‌లో ఈవీ వాహనాల ట్రెండ్ నడుస్తుంది. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు ముందుకు రావడంతో అన్ని కంపెనీలు తమ వెర్షన్ ఈవీ వాహనాలను మార్కెట్‌లో లాంచ్ చేస్తున్నాయి. అయితే ఈవీ మార్కెట్‌లో టూవీలర్స్ అందులోనూ స్కూటర్ల కొనుగోలు బాగా పెరిగానా కార్ల విషయానికి వచ్చేసరికి వినియోగదారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అయితే కొన్ని కంపెనీలు కార్ల ఈవీ మార్కెట్‌ను క్యాప్చర్ చేయడానికి సరికొత్త ఫీచర్స్‌తో తమ కార్లను భారత మార్కెట్‌లో లాంచ్ చేయడానికి సిద్ధం అవుతున్నాయి.



ఎంజీ విండ్సర్ ఈవీ త్వరలో లాంగ్-రేంజ్ వేరియంట్ కారు కింద భారత మార్కెట్‌లో లాంచ్ చేయనున్నారు. ఈ కారు 50 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్‌తో రావడం వల్ల ఈ కారు 460 కి.మీ మైలేజ్ ఇస్తుంది. ఈ వెర్షన్ మెరుగైన ఛార్జింగ్‌తో వస్తుందని చెబుతున్నారు. ఈ కారు మార్కెట్‌లో రిలీజైతే అత్యధిక అమ్మకాలను సాధించే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. మహీంద్రా మహీంద్రా ఎక్స్‌యూవీ 3 ఎక్స్‌ఓ ఈవీ కారు త్వరలో భారత మార్కెట్‌లో లాంచ్ కానుంది. రాబోయే ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ రెండు బ్యాటరీ ప్యాక్ ఎంపికలతో ఛార్జ్‌కి దాదాపు 450 కి.మీ పరిధిని అందిస్తుంది. ఈ కారు ముఖ్యంగా టాటా పంచ్ ఈవీకు గట్టి పోటీనిస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

మారుతి సుజుకీ ఈ-విటారా రాబోయే వారాల్లో లాంచ్ కానుంది. ఈ కారును ఒక్కసారి ఛార్జ్ చేస్తే 500 కి.మీ కంటే ఎక్కువ రేంజ్‌తో వస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ కారు లెవల్-2 ఏడీఏఎస్ టెక్, ఫుల్ డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ కన్సోల్, పెద్ద టచ్‌స్క్రీన్, పనోరమిక్ సన్‌రూఫ్, ఎల్‌ఈడీ లైటింగ్, పవర్-అడ్జస్టబుల్ డ్రైవర్ సీటు, వెంటిలేషన్ ఫంక్షన్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ప్రీమియం ఫీచర్లతో ఈ కారు మార్కెట్‌లో లాంచ్ కానుంది.

టాటా హారియర్ ఈవీ కారును భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో ప్రదర్శించారు. ఈ కారు కొన్ని వారాల్లో భారత మార్కెట్‌ను పలుకరించనుంది. 75 కేడబ్ల్యూహెచ్ లిథియం-అయాన్ బ్యాటరీ ప్యాక్‌తో నడిచే ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీను ఓ సారి ఛార్జ్ చేస్తే 500 కి.మీ మైలేజ్ ఇస్తుందని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. 500 ఎన్‌ఎం గరిష్ట టార్క్‌ను ఉత్పత్తి చేసే డ్యూయల్-మోటార్ ఆల్-వీల్-డ్రైవ్ సెటప్‌తో ఈ కారును లాంచ్ చేస్తున్నట్లు టాటా కంపెనీ చెబుతుంది.




ఎంజీ సైబర్‌స్టర్, ఎం9 ఎంపీవీ రెండూ కార్లు కొత్తగా స్థాపించిన ఎంజీ సెలెక్ట్ డీలర్‌షిప్‌ల ద్వారా అందుబాటులో ఉంటాయని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. ఈ రెండు కార్లు టూ-డోర్-డ్రాప్-టాప్ స్పోర్ట్స్ సెటప్‌లో వస్తుంది. ఈ నెలలో ఎం9 ప్రీమియం ఎంపీవీ కంటే ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు ఈ కారులో విశాలమైన ఇంటీరియర్, సౌకర్యవంతమైన ఫీచర్స్‌తో ఆకట్టుకుంటుందని వివరిస్తున్నారు.

# ఢిల్లీకి వరుసగా మూడో విజయం

**ఛేదనలో మరోసారి చిత్తైన సూపర్ కింగ్స్..**




**చెన్నై:** ఐపీఎల్ 18 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జైత్రయాత్ర కొనసాగుతోంది. తొలిరెండు మ్యాచుల్లో విజయాలు సాధించిన ఢిల్లీ మూడో పోరులోనూ విజయభేరి మోగించింది. చెపాక్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌ను 25 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించింది. కేఎల్ రాహుల్(77) అర్ధ శతకంతో చెలరేగగా.. బౌలర్లు ఆదిలోనే వికెట్లు తీసి చెన్నైని ఓటమి అంచులోకి నెట్టారు. పవర్ ప్లేలో 41 రన్స్‌కే 3 కీలక వికెట్లు కోల్పోయిన సీఎస్కే ఏ దశలోనూ కోలుకోలేదు. ఆఖర్లో విజయ్ శంకర్(68 నాటౌట్), ఎంఎస్ ధోనీ (30 నాటౌట్)లు పోరాడినా జట్టును గెలిపించలేకపోయారు.

ఛేదన అంటే చాలు చెన్నై సూపర్ కింగ్స్ తడబడుతోంది.



వరుసగా రెండో మ్యాచ్‌లోనూ సీఎస్కేచతికిలపడింది. ఢిల్లీ క్యాపిటల్స్ నిర్దేశించిన 184 పరుగుల ఛేదనలో టాపార్డర్ వైఫల్యంతో ఓటమి అంచుల్లోకి వెళ్లింది. తొలి ఓవర్లోనే రిటర్న్ క్యాచ్‌తో రచిన్ రవీంద్ర(3)ను వెనక్కి పంపాడు. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే డెవాన్ కాన్వే(13)ను విప్రజ్ నిగమ్ బోల్తా కొట్టించాడు.

ఆ కాసేపటికే మిచెల్ స్టార్క్ బౌలింగ్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(5) పెద్ద షాట్ ఆడగా.. బౌండరీ లైన్ వద్ద క్యాచ్ అందుకున్నాడు. దాంతో, 41 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఆపద్బాంధవుడు శివం దూబే(18), రవీంద్ర జడేజా(2)లు ఘోరంగా విఫలమయ్యారు. దూబే ఔట్ అయ్యాక.. విజయ్ శంకర్(68 నాటౌట్) అండగా ఎంఎస్ ధోనీ(30 నాటౌట్) చివరివరకూ పోరాడాడు. ఆరో వికెట్‌కు 84 పరుగులు జోడించినా ఓటమి తప్పించలేకపోయారు.

### రాహుల్ మెరుపులతో..

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకన్న ఢిల్లీకి సీఎస్కే పేసర్ ఖలీల్ అహ్మద్ ఆదిలోనే షాకిచ్చాడు. డేంజరస్ ఓపెనర్ ఫ్రేజర్ మెక్‌గుర్క్(0)ను డకౌట్‌గా వెనక్కి పంపాడు. సున్నాకే వికెట్ పడిన వేళ కేఎల్ రాహుల్(77), అభిషేక్ పొరెల్(33)లు దూకుడుగా ఆడి సీఎస్కేపై ఒత్తిడి పెంచారు. రవీంద్ర జడేజా బౌలింగ్‌లో పొరెల్ వెనుదిరగడంతో 54 పరుగుల వద్ద ఢిల్లీ రెండో వికెట్ కోల్పోయింది. అనంతరం క్రీజులోకి వచ్చిన కెప్టెన్ అక్షర్ పటేల్(21) ధాటిగా ఆడే ప్రయత్నం చేశాడు. అశ్విన్ బౌలింగ్‌లో స్ట్రెయిట్‌గా భారీ సిక్సర్ బాదిన అతడు.. నూర్ అహ్మద్ బౌలింగ్‌ను అంచనా వేయలేక క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దాంతో, 90 వద్ద ఢిల్లీ మూడో వికెట్ పడింది.

అక్షర్ పటేల్ వెనుదిరిగాక కేఎల్ రాహుల్ గేర్ మార్చాడు. చెన్నై స్పిన్నర్లపై ఎదురుదాడికి దిగి బౌండరీలతో చెపాక్‌ను హోరెత్తించాడు. 33 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకన్న రాహుల్ ఆ తర్వాత మరింత దూకుడుగా ఆడాడు. సమీర్ రిజ్వీతో కలిసి నాలుగో వికెట్‌కు 56 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. డిల్లీ స్కోర్ బోర్డును ఉరికిస్తున్న ఈ జోడీని ఖలీల్ విడదీశాడు. ఆ తర్వాత ఎంట్రీ ఇచ్చిన ట్రిస్టన్ స్టబ్స్(21) రెండు ఫోర్లు, ఒక సిక్సర్‌తో జట్టు స్కోర్ 180 దాటించాడు. పథిరన వేసిన 20వ ఓవర్లో రాహుల్, ఫినిషర్ అశుతోష్ శర్మ(1)లు ఔట్ కావడంతో ఢిల్లీ 183 పరుగులకే పరిమితమైంది.

# వన్డేల్లో వేగంగా 2 వేల పరుగులు..



**తొలి న్యూజిలాండ్ బ్యాటర్‌గా మిచెల్ రికార్డు**

**న్యూజిలాండ్:** న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ డారిల్ మిచెల్ రికార్డు సృష్టించాడు. గత కొంతకాలంగా కివీస్ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న అతడు వన్డేల్లో 2 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. 50 ఓవర్ల ఫార్మాట్‌లో నిలకడగా రాణిస్తున్న మిచెల్.. స్వదేశంలో పాకిస్థాన్‌తో జరిగిన రెండో వన్డేలో 43 పరుగులు చేసి 2 వేల క్లబ్‌లో చేరాడు.

తద్వారా ఈ ఫార్మాట్‌లో అత్యంత వేగంగా ఈ మైలురా యికి చేరిన తొలి కివీస్ బ్యాటర్‌గా గుర్తింపు సాధించాడు. 47వ ఇన్నింగ్స్‌లో మిచెల్ ఈ ఘనతకు చేరువయ్యాడు. ఇంతకుముందు ఈ రికార్డు ఆండ్రూ జోన్స్ పేరిట ఉంది. అతడు 1991 ఫిబ్రవరిలో 52వ ఇన్నింగ్స్‌లో 2,000 రన్స్ సాధించాడు. 2014లో ఆ జట్టు మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ 54 ఇన్నింగ్స్‌ల్లో 2 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. అంతర్జాతీయంగా చూస్తే.. తక్కువ ఇన్నింగ్స్‌ల్లో క్లబ్‌లో చేరిన ఎనిమిదో ఆటగాడిగా మిచెల్ రికార్డు లిఖించాడు.

### టాప్‌లో శుభ్‌మన్ గిల్

వన్డే క్రికెట్‌లో వేగంగా 2వేల పరుగులు సాధించిన బ్యాటర్లు చాలామందే ఉన్నారు. అయితే.. ఈ జాబితాలో భారత జట్టు వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అగ్రస్థానంలో నిలిచాడు. రెండేళ్ల క్రితం సెంచరీల మీద సెంచరీలు బాదిన గిల్ 38 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ మైలురాయికి చేరుకున్నాడు. 40 ఇన్నింగ్స్‌ల్లో 2వేల క్లబ్‌లో చేరిన దక్షిణాఫ్రికా వెటరన్ హషీమ్ ఆమ్లా రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. పాకిస్థాన్ ఆటగాడు జహీర్ అబ్బాస్, ఇంగ్లండ్ మాజీ సారథి కెవిన్ పీటర్సన్, పాక్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజంలు.. 45 ఇన్నింగ్స్‌ల్లో 2 వేల పరుగులు సాధించారు.

**జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న**

# సన్‌రైజర్స్ ఆటగాళ్లు

**హైదరాబాద్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్‌లో నిరాశపరుస్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ కీలక మ్యాచ్‌కు సిద్ధమైంది. హ్యాట్రిక్ ఓటముల నుంచి తేరుకొని పంజా విసిరేందుకు హైదరాబాద్ ఆటగాళ్లు సన్నద్ధమవుతున్నారు. ఉప్పల్ స్టేడియంలో గుజరాత్ టైటన్స్‌తో మ్యాచ్‌కు





ముందు ఆరెంజ్ ఆర్మీ ప్లేయర్లు దైవ దర్శనం చేసుకున్నారు. ఓపెనర్ అభిషేక్ శర్మ, ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డిలు శనివారం జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన వీళ్లు అనంతరం తల్లి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా పూజారులు అభిషేక్, నితీశ్‌లకు అమ్మవారి ప్రసాదం అందించారు. ఆ తర్వాత ఆలయ అధికారులు ఇద్దరినీ సన్మానించారు. ప్రస్తుతం ఆ వీడియో నెట్టింట వైరలవుతోంది.

ఐపీఎల్ 18వ సీజన్‌ను విజయంతో ఆరంభించిన సన్‌రైజర్స్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. లక్నో, ఢిల్లీ చేతిలో చిత్తుగా ఓడిన హైదరాబాద్ కోల్‌కతా నైట్ రైడర్స్‌పై 80 పరుగుల తేడాతో మ్యాచ్ చేజార్చుకుంది. దాంతో, గుజరాత్‌తో ఆదివారం జరుగబోయే మ్యాచ్ కమిన్స్ సేనకు కీలకం కానుంది. గత మూడు మ్యాచుల్లో దారుణంగా విఫలమైన అభిషేక్, నితీశ్ కుమార్ రెడ్డిలు అదరగొట్టాలనే కసితో ఉన్నారు. ఓపెనర్ ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్.. క్లాసెన్, అనికేత్ వర్మలు చెలరేగి ఆడితే గుజరాత్‌కు కష్టాలు తప్పకపోవచ్చు.

# కింగ్స్‌కు చెక్.. రాణించిన జైస్వాల్, పరాగ్

**పంజాబ్‌పై రాజస్థాన్ విజయం**

**ముల్లాన్‌పూర్:** ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ వరుస విజయాల పరంపరకు రాజస్థాన్ రాయల్స్ చెక్ పెట్టింది. శనివారం డబుల్ ధమాకాలో భాగంగా జరిగిన రెండో పోరులో పంజాబ్‌పై రాజస్థాన్ 50 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ సీజన్‌లో సొంత ఇలాఖాలో తొలి విజయాన్ని ఖాతాలో వేసుకుందామనుకున్న పంజాబ్ ఆశలపై రాజస్థాన్ నీళ్లు గుమ్మరించింది. తొలుత యశస్వి జైస్వాల్(45 బంతుల్లో 67, 3ఫోర్లు, 5సిక్స్‌లు) అర్ధసెంచరీకి తోడు రియాన్ పరాగ్(25 బంతుల్లో 43 నాటౌట్, 3ఫోర్లు, 3సిక్స్‌లు) రాణించడంతో రాజస్థాన్ 20 ఓవర్లలో 205/4 స్కోరు చేసింది. ఆఖర్లో హెట్‌మైర్(12 బంతుల్లో 20, 2ఫోర్లు, సిక్స్) ధనాధన్ ఇన్నింగ్స్‌తో రాజస్థాన్ 200ల మార్క్ అందుకుంది. నిలకడలేమితో సతమతమవుతున్న జైస్వాల్..పంజాబ్‌తో మ్యాచ్‌లో అదరగొట్టాడు.

కెప్టెన్ సంజూ శాంసన్(38) సహకారంతో జైస్వాల్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఓవైపు చూడచక్కని షాట్లతో అలరిస్తూ బౌండరీలతో ఆకట్టుకున్నాడు. తన ఇన్నింగ్స్‌లో 3ఫోర్లు, 5 భారీ సిక్స్‌లతో దుమ్మురేపాడు. శాంసన్‌తో కలిసి తొలి వికెట్‌కు 89 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన జైస్వాల్..పరాగ్‌తోనూ అదే దూకుడు కొనసాగించాడు. తానేం





తక్కువ కాదన్నట్లు పరాగ్ కూడా చెలరేగడంతో పరుగుల రాక జోరందుకుంది. ఫెర్గుసన్‌కు(2/37) రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 155/9 స్కోరు చేసింది. నేహాల్ వధేరా(41 బంతుల్లో 62, 4ఫోర్లు, 3సిక్స్‌లు) మినహా అందరూ విఫలమయ్యారు. మాక్స్‌వెల్(30) రాణించాడు. ఆర్చర్‌కు మూడు వికెట్లు దక్కగా,యుధ్‌వీర్, తీక్షణ రెండేసి వికెట్లు తీశారు.

**సంక్షిప్త స్కోర్లు**

**రాజస్థాన్:** 20 ఓవర్లలో 205/4(జైస్వాల్ 67, పరాగ్ 43 నాటౌట్, ఫెర్గుసన్ 2/37, అర్ష్‌దీప్ 1/35),

**పంజాబ్:** 20 ఓవర్లలో 155/9 (నేహాల్ 62, మ్యాక్స్‌వెల్ 30, సందీప్ 2/21, ఆర్చర్ 3/25)

## 'కూలీ' విడుదల తేదీ ఫిక్స్..

### తలైవర్‌కి పోటీగా హృతిక్ రోషన్ 'వార్ 2'



**టాకీస్:** తలైవా రజనీకాంత్ ప్రస్తుతం లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' అనే చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. సన్‌పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధిమారన్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా.. తలైవ కెరీర్‌లో ఇది 171వ సినిమా ఇది. సౌత్ ఇండియన్ మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు. అగ్ర నటులు నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, చౌబిన్ సాహిర్, శృతి హాసన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తమిళ చిత్రసీమలో ఉన్న టాప్ దర్శకుల్లో ఒకరైన లోకేష్ కనగరాజ్‌తో రజనీకాంత్ జోడీ కడుతుండడంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ విడుదల తేదీని ప్రకటించారు.

ఈ సినిమాను ఇండిపెండెన్స్ కానుకగా ఆగష్టు 14న విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు మేకర్స్. అయితే ఇదే రోజున బాలీవుడ్ నుంచి మరో అగ్ర సినిమా రాబోతుంది. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ హీరోలుగా నటిస్తున్న చిత్రం వార్ 2. ఈ సినిమాకు అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తుండగా.. ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నాడు. అయితే ఈ మూవీ కూడా ఆగష్టు 14నే విడుదల కాబోతుంది. రెండు పాన్ ఇండియా సినిమాలు అలాగే భారీ అంచనాలు కూడా ఈ రెండు సినిమాలకు ఉండడంతో బాక్సాఫీస్ వద్ద క్లాష్ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. కూలీ గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతుండగా.. వార్ 2 దేశభక్తి నేపథ్యంలో రాబోతుంది.

## రామానాయుడు స్టూడియోకు విశాఖ కలెక్టర్ నోటీసులు

**టాకీస్:** విశాఖపట్నంలోని రామానాయుడు స్టూడియోకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తుంది. ఈ నోటీసులకు సంబంధించి స్టూడియో యాజమాన్యం నుంచి రెండు వారాల్లో వివరణ కోరినట్లు సమాచారం. రామానాయుడు స్టూడియోకు చిత్ర నిర్మాణ పరిశ్రమ, స్టూడియో నిర్మాణం కోసం ప్రభుత్వం 34 ఎకరాలకు పైగా భూమిని కేటాయించింది.



అయితే ఇందులో 15.17 ఎకరాల భూమిని స్టూడియో కోసం కాకుండా.. హౌసింగ్ లేఅవుట్ కోసం మార్పులు చేయాలని యాజమాన్యం కోరడంతో ఈ భూమి కేటాయింపును రద్దు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, నిర్దేశిత ప్రయోజనం కోసం కేటాయించిన భూమిని వేరే అవసరాలకు ఉపయోగిస్తే దాన్ని రద్దు చేయవచ్చని స్పష్టం చేయడంతో, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోదియా ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాల ఆధారంగా కలెక్టర్ నోటీసులు జారీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అయితే ఈ నోటీసులకు సంబంధించి సురేష్ ప్రొడక్షన్స్ స్పందిచాల్సి ఉంది.



## గ్లామర్‌తో చంపేస్తున్న బాలయ్య బ్యూటీ

టాకీస్: పింక్ డ్రెస్‌లో తన అందాలతో మాయ చేస్తోంది ప్రగ్యాజైస్వాల్. చాలా సింపుల్ లుక్ లో ట్రెండీ డ్రెస్‌లో ఈ బ్యూటీ అందం చూస్తే ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే. ప్రస్తుతం ఈ బ్యూటికి సంబంధించిన ఫొటోలు నెట్టింట్లో తెగ వైరల్ అవుతున్నాయి. ప్రగ్యాజైస్వాల్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. తన అందచందాలతో ఎంతో మందిని మాయ చేసింది ఈ బ్యూటీ. మిర్చిలాంటి కుర్రాడు సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది.

ఈ సినిమాతో అంతగా గుర్తింపు రానప్పటికీ, కంచె సినిమాతో మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఈ మూవీలో ఈ బ్యూటీ నటనకు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. కానీ అవకాశాలు మాత్రం తక్కువే అని చెప్పాలి. కంచె మూవీ తర్వాత బాలయ్య అఖండ సినిమాలో ఛాన్స్ కొట్టేసి బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. తర్వాత డాకు మహారాజ్ లో అవకాశం అందుకొని ఈ మూవీతో కూడా బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకుంది ఈ చిన్నది. కానీ ఈ ముద్దుగుమ్మకు ఆశించిన స్థాయిలో అవకాశాలు రావడం లేదు. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ వరస ఫొటో షూట్స్ తో కుర్రకారు మదిని దోచేస్తుంటుంది. తాజాగా ఈ చిన్నది పింక్ కలర్ డ్రెస్ లో తన అందాలతో మతిపోగొడుతుంది. పింక్ డ్రెండీ డ్రెస్ లో ఈ బ్యూటీ అందాలకు ఎక్కవరైనా ఫిదా అవ్వాల్సిందే.

## వాల్తేరు వీరయ్యతో పుష్పరాజ్

### ఎడిట్ వీడియో మెగా ఫ్యామిలీకి కిక్

**టాకీస్:** ఒకప్పుడు మెగా ఫ్యామిలీలో అల్లు ఫ్యామిలీ ఇమిడి ఉండేది. కాని ఇప్పుడు రెండు ఫ్యామిలీలు వేరు వేరు అని, అల్లు అర్జున్ మెగా హీరోగా కాకుండా అల్లు హీరోగానే చెప్పుకుంటున్నాడని ప్రచారాలు జరుగుతున్నాయి. గత కొద్ది రోజులుగా అల్లు వర్సెస్ మెగా రచ్చ గురించి నెట్టింట జోరుగా చర్చ నడుస్తూ ఉంది. ఏ చిన్న ఛాన్స్ దొరికిన సోషల్ మీడియాలో వీరిద్దరి మధ్య విబేధాలు వచ్చాయని దానికి సాక్షం ఫలానా అంటూ ఏవో ఫొటోలు, వీడియోలు చూపిస్తూ ఉంటారు. అయితే తాజాగా నెట్టింట చక్కర్లు కొడుతున్న వీడియో అటు కొణిదెల, ఇటు అల్లు ఫ్యాన్స్‌కి మాంచి కిక్ ఇస్తుంది. మెగాస్టార్ రీఎంట్రీ తర్వాత బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. బాబీ కొల్లి దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2023 సంక్రాంతికి వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా రూ.200 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేయడంతో పాటు ఫ్యాన్సని ఎంతగానో అలరించింది. మరోవైపు అల్లు అర్జున్ పుష్ప, పుష్ప2 చిత్రాలతో తన క్రేజ్‌ని మరింత పెంచుకున్నాడు. బన్నీ క్రేజ్ ఇప్పుడు గ్లోబల్ స్థాయికి చేరింది. అయితే ఓ నెటిజన్ ఇప్పుడు వాల్తేరు వీరయ్య, పుష్ప రాజ్ పాత్రలను కలిపి క్రాస్ ఓవర్ వీడియో మాదిరిగా ఎడిట్ చేసాడు. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతుంది. 'వాల్తేరు వీరయ్య', 'పుష్ప 2' సినిమాలలోని కొన్ని ఇంట్రెస్టింగ్ సీన్స్ తో ఈ వీడియో రూపొందించారు. 'పుష్ప 2' ఇంట్రడక్షన్ సన్నివేశంలో జపాన్



హార్బర్ లో అల్లు అర్జున్ ను వేలాడదీస్తారు. అక్కడికి వచ్చిన చిరంజీవి "వాల్తేరు వీరయ్యని నేనే.. మీరు వెతుకుతున్న గ్యాంగ్ లీడర్ ని నేనే.. మీ కథలోకి నేను రాలేదు. నా కథలోకే మీరందరూ వచ్చారు. నేను ఇక్కడికి అడుగెట్టిందే వీడి కోసం" అని డైలాగ్ చెబుతారు. సీఎం అవ్వడానికి 100 కోట్ల దాకా ఖర్చు అవుతుందని బన్నీతో రావు రమేష్ చెప్పే సన్నివేశంలోకి చిరు వచ్చినట్టుగా క్రియేట్ చేశారు. ఫోటో తీయమని అల్లు అర్జున్ అంటే.. ఒక్క నిమిషం ఉండమని చిరంజీవి కళ్లద్దాలు పెట్టుకోవడం బాగా సింక్ అయింది.ఇక పుష్ప-2 ఇంటర్వెల్ సీన్ లో షెకావత్ కి పుష్పరాజ్ సారీ చెప్పడానికి రెడీ అవుతుండగా.. మధ్యలోకి వచ్చిన వీరయ్య తెలుగులో నాకు నచ్చని పదం అంటూ డైలాగ్ చెబుతాడు. ఇలా సరదాగా వాల్తేరు వీరయ్య, పుష్ప రాజ్ పాత్రలతో ఎడిట్ చేసిన వీడియో ఫ్యాన్స్‌ని ఎంతగానో అలరిస్తుంది.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కల్కి దర్శకుడు నాగ్ అశ్విన్



టాకీస్: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని టాలీవుడ్ సినీ దర్శకుడు నాగ్ అశ్విన్ దర్శించుకున్నాడు. కల్కి సినిమాతో గతేడాది సూపర్ హిట్ అందుకున్న ప్రముఖ సినీ దర్శకుడు నాగ్ అశ్విన్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నాడు. శనివారం ఉదయం కుటుంబసభ్యులతో తిరుమలకి చేరుకున్న నాగ్ అశ్విన్ శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న అతడికి తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు నటిని శేషవస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనం చేశారు. స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.

## అజిత్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ట్రైలర్ రిలీజ్

**టాకీస్:** తమిళ అగ్ర నటుడు అజిత్‌కుమార్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. ఈ సినిమాకు అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తుండగా.. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 10న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సినిమాలో అజిత్ ఏకే అనే గ్యాంగ్‌స్టర్‌గా కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకి జీవి ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. సిమ్రాన్, ప్రభు, అర్జున్ దాస్, సునీల్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



## అభిమానులకు గుడ్‌న్యూస్ చెప్పిన ఎన్టీఆర్

**టాకీస్:** యంగ్ టైగర్ ఎన్టీఆర్ తాజాగా 'మ్యాడ్ స్క్వేర్' మూవీ సక్సెస్ మీట్ కు గెస్ట్ గా హాజరైన విషయం తెలిసిందే. ఈవెంట్‌లో ఎన్టీఆర్ చాలా హుషారుగా మాట్లాడారు. దేవర హిట్ చేసినందుకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. దేవర మూవీని మీ భుజాలపై మోసి, ఆదరించినందుకు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. మీకోసం నేను ఎప్పటికీ కష్టపడతాను అని అన్నారు. అలానే తన అప్ కమింగ్ చిత్రాలపై క్రేజీ అప్డేట్ ఇచ్చారు. ఇన్ని రోజులు ఎన్టీఆర్ లైనప్‌కి సంబంధించి అభిమానులలో అనేక డౌట్స్ ఉండగా, ఇప్పుడు వాటిపై ఆయన చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అయ్యాయి. మ్యాడ్ స్క్వేర్ మూవీ టీమ్ అందరి గురించి తొలుత మాట్లాడిన తారక్.. ఆ తర్వాత సెక్యూరిటీ రీజన్స్ వల్ల దేవర మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ రద్దు అవ్వగా.. ఆ తర్వాత విజయోత్సవ వేడుక జరపాలన్నా కూడా కుదరలేదు అని అన్నారు. ఇక దేవర సీక్వెల్ గురించి మాట్లాడుతూ.. దేవర సీక్వెల్ క్యాన్సిల్ అయిందని అప్పట్లో టాక్ వచ్చింది. కాని కచ్చితంగా సీక్వెల్ ఉంటుందని తారక్ తెలిపారు. దేవర-2 లేదని అనుకున్న వారందరికీ చెబుతున్నా..



కచ్చితంగా సీక్వెల్ ఉంటుంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ మూవీ చేయాల్సి ఉన్న నేపథ్యంలో దేవర 2కి కాస్త గ్యాప్ ఇచ్చామని అన్నారు. అంటే కొరటాల శివతో దేవర-2, ప్రశాంత్ నీల్ తో ఒక సినిమా.. మొత్తం రెండు చేస్తున్నట్లు క్లారిటీ ఇచ్చారు. అలానే నాగవంశీ నిర్మాతగా తాను ఓ సినిమా చేయనున్నానని వెల్లడించారు తారక్. ఆ ప్రాజెక్ట్ స్టార్ట్ అయిన దేన ఫ్యాన్స్ ను హ్యాండిల్ చేసే పూర్తి బాధ్యత తనకు అప్పగించబోతున్నట్లు చెప్పుకొచ్చారు ఎన్టీఆర్. ఇక పొగడాలి అన్నా, తిట్టాలన్నా కూడా వంశీనే దానికి ఇన్‌చార్జ్ అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జైలర్ ఫేమ్ నెల్సన్ దిలీప్ కుమార్ డైరెక్షన్ లో ఎన్టీఆర్ ఓ సినిమా చేస్తారని అప్పట్లో ప్రచారం జరగగా, ఆ మూవీని నాగవంశీ నిర్మించనున్నారని తెలుస్తుంది. కామెడీ చేయడం కష్టం కాబట్టి అదుర్స్ చేయడం లేదని నవ్వుతూ అన్నారు. ఇక అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో వార్2 అనే చిత్రాన్ని హృతిక్ రోషన్‌తో కలిసి చేస్తున్నాడు జూనియర్. ఇలా పలు సినిమాలతో రానున్న రోజులలో ఫుల్ ఎంటర్‌టైన్ అందించనున్నాడు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.